నవతెలంగాణ
ఆదిలాబాద్
శనివారం | అక్టోబర్ 21, 2023 | www.navatelangana.com

లింగిలో జోరుగా బీఆర్ఎస్ ప్రచారం

తలమడుగు : లింగి గ్రామంలో శుక్రవారం నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి అనిల్ జాదవ్ తరపున మండల బీఆర్ఎస్ నాయకులు జోరుగా ప్రచారం కొనసాగించారు. గడపగడపకు తిరుగుతూ ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు అమలు చేస్తున్న అభివృద్ధి పథకాలను తెలియజేస్తూ ప్రచారం కొనసాగించారు. అనిల్ జాదవ్‌ను గెలిపించినట్లయితే నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరుస్తాడంటూ పేర్కొన్నారు. ప్రచార కార్యక్రమంలో మండల కన్వీనర్ తోట వెంకటేష్, నియోజకవర్గ అధికార ప్రతినిధి కిరణ్‌కుమార్, పిఎసిఎస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, ఖోడద్ సర్పంచ్ సాకి ఆనంద్, ముడుపు కేదారేశ్వర్‌రెడ్డి, ఆశన్న యాదవ్, కాటిపల్లి శ్రీనివాసరెడ్డి, సునీతరెడ్డి, పొచ్చన్న, అభిరాంరెడ్డి, మల్లేష్, ఆసం రవి, రమాకాంత్ పాల్గొన్నారు.



పాత మద్దిపడగలో జాన్సన్ నాయక్ ప్రచారం

నవతెలంగాణ-కడెం

బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి భూక్యా జాన్సన్ నాయక్ మండలంలోని పాత మద్దిపడగ గ్రామంలో శుక్రవారం ప్రచారం నిర్వహించారు. ముందుగా దుర్గామాత ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం గ్రామ ప్రజలతో మాట్లాడారు. ఖానాపూర్ గడ్డమీద బీఆర్ఎస్ జండా ముచ్చటగా మూడోసారి ఎగిరే విధంగా ప్రతి కార్యకర్త గెలుపుకు కృషి చేయాలన్నారు. కెసిఆర్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ఇంటింటికి ప్రచారం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ అధ్యక్షులు జొన్నల చంద్రశేఖర్ గుప్తా, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సివిల్ కోర్టు జడ్జికి సన్మానం



నవతెలంగాణ-చెన్నూర్

మున్సిఫ్ కోర్టు జడ్జి సిహెచ్ సంపత్‌ను శుక్రవారం మంచిర్యాల న్యాయవాదులు సన్మానించారు. కాకతీయ విశ్వవిద్యాలయంలో ఎల్ఎల్ఎమ్ చదువుకుని అదే విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ పూర్తి చేసి డాక్టరేట్ అందుకున్న జడ్జిని అభినందించారు. అతి సామాన్యమైన కుటుంబంలో పుట్టి అత్యుత్తమ స్థానానికి చేరుకోవడం గర్వించదగ్గ విషయమని న్యాయవాదులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా న్యాయవాదులు కర్రే లచ్చన్న, సురేంద్రచారి, బి.జగన్, ఎం కార్తిక్ పాల్గొన్నారు.

పత్తి పంట క్షేత్ర ప్రదర్శన



నవతెలంగాణ-తాంసి

పత్తి పంట క్షేత్ర ప్రదర్శన శుక్రవారం మండల కేంద్రానికి చెందిన లింగంగౌడ్ పత్తి పంటలో నిర్వహించారు. ఫసల్ సీడ్స్ బయోటెక్ కంపెనీకి సంబంధించిన బీటీ-2 వంగడానికి చెందిన పత్తి పంటను మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులకు చూపి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కంపెనీ ప్రతినిధి కరుణాకర్ మాట్లాడుతూ ఈ పత్తిని అన్ని రకాల పంట పొలాల్లో వేసుకోవచ్చున్నారు. చెట్టుకు దాదాపు అరవై నుండి డెబ్బై పత్తి కాయలు కాస్తాయన్నారు. పత్తి తీయడానికి సులువుగా ఉంటుందని తెలిపారు. రైతులకు అవగాహన కల్పించడం కోసమే పంట క్షేత్రాన్ని ప్రదర్శన నిర్వహించామని పేర్కొన్నారు. అనంతరం రైతును సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ స్వప్నరత్న ప్రకాష్, డీలర్ శ్రీకాంత్, కంపెనీ ఆర్ఎం సాగర్, రైతులు మహేందర్‌రెడ్డి, ప్రకాష్, భీమన్న, భూమన్న, రాములు, వివిధ గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

జీఓ 3కు చట్టబద్ధత కల్పించే పార్టీకే మద్దతు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఏజెన్సీలో ఆదివాసులకు వందశాతం ఉద్యోగాలు కల్పించే జీవో 3కు చట్టబద్ధత కల్పించడానికి మేనిఫెస్టోలో పెడతారో వారికే మద్దతు తెలుపుతామని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం(టీఏజీఎస్) జిల్లా అధ్యక్షులు ఉయిక విష్ణు అన్నారు. శుక్రవారం సుందరయ్య భవనంలో నిర్వహించిన జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదివాసీ వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ, ఆదివాసీలను అడవి నుండి వెళ్లగొట్టే విధంగా చట్టాలు చేస్తున్న బీజేపీ, బీఆర్ఎస్‌ను ఓడించాలని తెలిపారు. ఆదివాసుల అభివృద్ధి ప్రణాళికను అన్ని పార్టీలు తమ మేనిఫెస్టోలో ప్రకటించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మడావి నాగోరావ్, కనక మల్కు, మేస్రం మహేష్, వెట్టి గణేష్ పాల్గొన్నారు.

ఫొటో, వీడియోగ్రఫీ పోటీలకు ఆహ్వానం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పోలీసు అమరవీరుల వారోత్సవాలలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఔత్సాహిక ఫోటోగ్రాఫర్లకు, వీడియో గ్రాఫర్లకు రాష్ట్ర, జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహిస్తున్నామని ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని విద్యార్థిని, విద్యార్థులకు, యువతకు, ఔత్సాహిక ఫోటోగ్రాఫర్లకు, వీడియో గ్రాఫర్లకు పోలీసులు చేసిన సేవలకు సంబంధించిన ఫోటోలు లేదా రోడ్డు ప్రమాదాల నివారణ, సైబర్ నేరాలు, కమ్యూనిటీ పోలీసింగ్, మూఢనమ్మకాలు, ఇతర సామాజిక రుగ్మతలు, అత్యవసర సమయాల్లో పోలీసుల స్పందన, ప్రకృతి వైపరీత్యాలలో పోలీసుల పాత్ర అనే అంశాలపై తెలుగు, ఉర్దూ, ఇంగ్లీష్ భాషలలో మూడు నిమిషాలకు తగ్గకుండా షార్ట్ వీడియోలను రూపొందించాలని తెలిపారు. ప్రతిభ కనబరిచిన మొదటి మూడు ఫోటోలు, వీడియోలకు జిల్లాలో బహుమతి ప్రదానం చేస్తూ రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తామని తెలిపారు. ఫోటోలను, వీడియోలను ఆన్‌లైన్ ద్వారా 26 లోపు అందజేయాలని తెలిపారు.

అంగన్వాడీ కేంద్రం పరిశీలన



నవతెలంగాణ-నార్నూర్

మండల కేంద్రంలోని జిన్‌గూడ అంగన్వాడీ కేంద్రాన్ని శుక్రవారం సిడిపిఓ శారద పరిశీలించారు. చిన్నారులకు, గర్భిణులకు, బాలింతలకు అందిస్తున్న పౌష్టికాహార పట్టికను పరిశీలించారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతలు రక్తహీనతకు గురి కాకుండా పౌష్టికాహారం అందించాలని పేర్కొన్నారు. ఆమె వెంట అంగన్వాడీ టీచర్ పంచశీల ఉన్నారు.

ఉచిత రక్తదానానికి యువత ముందుకు రావాలి

నవతెలంగాణ-లక్ష్మణచాంద

పోలీస్ అమర వీరుల దినోత్సవం పురస్కరించుకొని శనివారం జిల్లా కేంద్రంలో ఎస్పీ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఉచిత రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నామని ఎస్సై శ్రీకాంత్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలానికి చెందిన యువత ముందుకు వచ్చి రక్తదానం చేయాలని కోరారు.

మద్యం మరింత ప్రియం..!

- అక్రమ మార్గాల్లో పల్లెలకు మద్యం సరఫరా
- రూ.180 క్వాటర్ సీసాకు రూ.300చొప్పున వసూలు
- గ్రామాల్లో గుట్టుగా సాగుతున్న విక్రయాలు
- బెల్టు దుకాణాలపై పోలీసుల ఉక్కుపాదం

ఎన్నికల కోడ్‌తో పల్లెల్లో బెల్టు దుకాణాలు తొలగిపోతుండగా..ఇదే అదనుగా భావిస్తున్న కొందరు అక్రమార్కులు ఈ అవకాశాన్ని సొమ్ము చేసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. గుట్టుచప్పుడు కాకుండా పల్లెలకు మద్యం సరఫరా చేస్తూ రెట్టింపు ధరలకు విక్రయాలు సాగిస్తున్నారు. ఒక్కో క్వాటర్ మద్యం సీసా రూ.180 ఉండగా..రూ.300 చొప్పున విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. స్థానికంగా మద్యం లభించకపోవడంతో గత్యంతరం లేక కొందరు మద్యం ప్రియులు అక్రమార్కులను ఆశ్రయిస్తూ కొనుగోలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఓ వైపు పోలీసులు బెల్టు దుకాణాలపై నిత్యం దాడులు నిర్వహిస్తూ సమూలంగా నిర్మూలిస్తుంటే..మరోపక్క కొందరు వ్యక్తులు గుట్టుచప్పుడు కాకుండా గ్రామాల్లోకి మద్యం చేరవేస్తున్నారని తెలుస్తోంది. మద్యానికి అలవాటుపడిన కొందరు అధిక ధర వెచ్చించైనా కొనుగోలు చేసేందుకు సిద్ధపడుతున్నట్లు ప్రచారం జరుగుతోంది.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా మద్యాన్ని పూర్తిగా నిషేధించాలని ఎన్నికల సంఘం భావిస్తోంది. ఇందులో భాగంగా పోలీసులు ప్రతి నిత్యం దాడులు నిర్వహిస్తూ బెల్టు దుకాణాలను తొలగిస్తున్నారు. నోటిఫికేషన్ వచ్చిన నాటి నుంచి రెండు రోజుల క్రితం వరకు ఆదిలాబాద్ జిల్లాలో రూ.4.64లక్షలు విలువ చేసే 1188లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకోగా.. 194 కేసులు నమోదు చేశారు. ప్రతి రోజూ ఎక్కడోచోట బెల్టు దుకాణాల నుంచి మద్యం సరఫరా కావడంతో పాటు ఇతర ప్రాంతాల నుంచి గ్రామాల్లోకి వస్తున్న నిషేధిత మద్యాన్ని పోలీసులు పట్టుకుంటున్నారు. అయినప్పటికీ గ్రామాల్లో మద్యం సరఫరా పూర్తిగా నిలిచిపోవడం లేదనే ప్రచారం జరుగుతోంది. పోలీసుల కళ్లుగప్పి కొందరు వ్యక్తులు గ్రామాల్లోకి వక్రమార్గాల్లో మద్యాన్ని తరలిస్తున్నట్లు తెలుస్తోంది. ఇతర చోట నిల్వ ఉంచి తెలిసిన వ్యక్తులకు గుట్టుగా విక్రయిస్తున్నట్లు సమాచారం. ఇది వరకు క్వాటర్ మద్యం సీసా రూ.180 వరకు ఉండగా.. మద్యం కొరత కారణంగా ఈ ధరను రెట్టింపు చేసి విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. గత్యంతరం లేని పరిస్థితిలో మద్యం ప్రియులు అధిక ధర చెల్లించి కొనుగోలు చేస్తున్నట్లు సమాచారం. ఇన్నాండ్లు అధికారికంగా నిర్వహిస్తున్న మద్యం దుకాణాలకు ఆదాయ వనరుగా ఉన్న బెల్టు దుకాణాల పట్ల ఆబ్కారీశాఖ అధికారులు ఉదాసీనంగా వ్యవహరించారనే ఆరోపణలున్నాయి. ఈ కారణంగానే గ్రామాల్లో బెల్టు దుకాణాలు ఇంకా రహస్యంగా కొనసాగుతున్నట్లు ప్రచారం జరుగుతోంది.

గుట్టుగా సాగుతున్న దందా..!


ప్రభుత్వం ఆబ్కారీశాఖ ద్వారా అధికారికంగా మద్యం దుకాణాలకు టెండర్లు పిలిచి నిర్వహించేలా చేస్తోంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 192 మద్యం దుకాణాలు ఉండగా అత్యధికంగా మంచిర్యాల జిల్లాలో 73, నిర్మల్‌లో 47, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 32, ఆదిలాబాద్ జిల్లాలో 40 మద్యం దుకాణాలు ఉన్నాయి. వీటి పరిధిలో ప్రతి నెలా సుమారు రూ.200కోట్ల నుంచి రూ.250కోట్ల వరకు వ్యాపారం జరుగుతోంది. ఆదాయం మొత్తం ప్రభుత్వానికి వెళ్తుంది. కానీ గ్రామాల్లో అనధికారికంగా గ్రామాల్లో బెల్టు దుకాణాలు వెలిశాయి. అధికారిక మద్యం దుకాణాల నుంచే వీటికి కూడా సరఫరా అవుతుంది. నిబంధనల ప్రకారం బెల్టు దుకాణాలు నిర్వహించడం నేరమైనా ఆబ్కారీశాఖ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. మరోపక్క తాజాగా ఎన్నికల కోడ్ దృష్ట్యా పోలీసులు దాడులు చేస్తుండటం కారణంగా అనేక బెల్టు దుకాణాలు తొలగిపోతున్నాయి. అయినప్పటికీ కొన్ని చోట్ల ఇతర ప్రాంతాల నుంచి గుట్టుచప్పుడు కాకుండా అక్రమ మద్యాన్ని తరలించి గ్రామాల్లో రహస్యంగా విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. ఇన్నాండ్లు ఉన్న బెల్టు దుకాణాలు ప్రస్తుతం లేకపోవడంతో మద్యం ప్రియులు అధిక ధరలు వెచ్చించి కొనుగోలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా పోలీసులతో పాటు ఆబ్కారీశాఖ అధికారులు గ్రామాల్లో రహస్య మద్యం సరఫరాపై దృష్టిసారించి నిర్మూలిస్తేనే ఈ అక్రమ దందాకు అడ్డుకట్టపడుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.



పోలీసులు పట్టుకున్న మద్యం(ఫైల్)

నేటి నుండి గంగనీళ్ల జాతర మహోత్సవం

ఆదివారం సాయంత్రం ముగింపు ఆలయం వద్ద ప్రత్యేక ఏర్పాట్లు : ఆలయ ఈఓ రంగు రవికిషన్





నవతెలంగాణ-సారంగాపూర్

జిల్లాలో ప్రసిద్ధిగాంచిన అడెల్లి మహా పోచమ్మ ఆలయంలో నేటి నుండి గంగనీళ్ల జాతర మహోత్సవం ప్రారంభం కానుంది. శనివారం జాతర ప్రారంభమై ఆదివారం సాయంత్రం ముగుస్తుంది. సహ్యాద్రి పర్వతాలకు ఆనుకొని శ్రీ మహా అడెల్లి పోచమ్మ దేవాలయం రెండు వేల సంవత్సరాల క్రితం వెలిసింది. ప్రతి ఏటా అమావాస్య తర్వాత దసరాకు ముందు వచ్చే శని, ఆదివారాల్లో గంగనీళ్ల జాతర ప్రారంభమవుతుంది. ఆలయం పునర్నిర్మాణంలో ఉన్నందున జాతర సందర్భంగా బాలల ఆలయాన్ని ఆలయ అధికారులు సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. జాతరకు తెలంగాణ రాష్ట్రం నలుమూలల నుండే కాకుండా మహారాష్ట్రలోని నాందేడ్, నాగ్‌పూర్, ముంబాయితో పాటు చత్తీస్‌ఘడ్ రాష్ట్రం నుండి యాత్రికులు ప్రత్యేక వాహనాల్లో అధిక సంఖ్యలో తరలి వస్తారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేశారు. జాతర మొదటి రోజు శనివారం అమ్మవారి(నగలు) ఆభరణాలను ప్రత్యేక పోలీసు భద్రత నడుమ సేవా దారులు, భక్తులు ఆలయం నుండి కాలినడకన అడెల్లి, సారంగాపూర్, యాకరపల్లె వంజర్, దిలావర్‌పూర్, కంజర్, బన్సపెల్లి గ్రామాల మీదుగా సాంగ్వి గ్రామానికి తీసుకెళ్తారు. అక్కడ రాత్రి బసచేసి ఆదివారం తెల్లవారుజామున గోదావరి నదికి చేరుకొని గంగ జలాలతో నగలను శుద్ధి చేస్తారు. అనంతరం వేలాదిగా తరలివచ్చిన యాత్రికులు, భక్తులు గంగనదిలో స్నానాలు ఆచరించి అమ్మవారి నగలతో పాటు గంగ జలాలను భాజాభజంత్రీలతో ఊరేగింపుగా దేవాలయానికి చేరుస్తారు. అమ్మవారికి గంగ జలాలతో అభిషేకం చేసి నగలను అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. గ్రామ గ్రామాన గ్రామస్తులు భక్తులకు మంగళ హారతులతో స్వాగతం పలికి అమ్మవారి నగలను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకుంటారు. ఇలా ప్రారంభమైన జాతర సంవత్సరం పొడవునా ప్రతి ఆదివారం వేలాది సంఖ్యలో భక్తులు వచ్చి కోనేటి నీటిలో స్నానాలు చేసి భక్తిశ్రద్ధలతో చక్కెర, బెల్లం బోనాలు వండి అమ్మవారికి నైవేద్యంగా సమర్పిస్తారు. అనంతరం అమ్మవారికి ఒడి బియ్యం, నూతన వస్త్రాలు సమర్పించి కుంకుమార్చన పూజలు చేస్తారు. కోరుకున్న కోరికలు నెరవేరక తులాభారం పుట్టి వెంట్రుకలు, తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకొని ఆలయ పరిసరాల్లో వన భోజనాలు చేస్తారు. ముఖ్యంగా జనవరి నుండి జూన్ మాసం వరకు ప్రతి ఆదివారం భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించి మొక్కులు తీర్చుకుంటారు.



కాంగ్రెస్ గెలుపు ఖాయం : వెడ్మ బొజ్జు



దస్తురాబాద్ : అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు ఖాయమని నియోజకవర్గ ఇన్‌చార్జి, టిపిసిసి ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జు, కర్ణాటక ఎమ్మెల్సీ ప్రకాష్ నాయక్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో కేసీఆర్ కుటుంబం ప్రజలను మోసం చేసిందన్నారు. పథకాల పేరుతో లక్షల కోట్లు సంపాదించుకున్నారన్నారు. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఆదరించాలని, రాబోయే ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలిపించాలని అన్నారు. 6గ్యారంటీలతో కూడిన మేనిపెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, ప్రతి కార్యకర్త కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి సైనికులా పనిచేయాలని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వంపై విరక్తితో50 మంది నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో చుంచు భూమన్న, మండల అధ్యక్షుడు దుర్గం మల్లేష్, జిల్లా అధ్యక్షుడు సతీష్‌రెడ్డి, గోపి, పుల్యానాయక్, ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు ఎంబడి గోపాల్, ప్రవీణ్, మధు, మహేందర్‌రెడ్డి, సుభాష్, రంజిత్, వెంకటేష్ పాల్గొన్నారు.

నేడు పోలీసు అమర వీరుల దినోత్సవం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీసుల గౌరవార్థం నిర్వహించే అమర వీరుల దినోత్సవాన్ని నేడు నిర్వహించనున్నారు. జిల్లాలో రాష్ట్రంలోనే మొదటిసారిగా అమరవీరుల ముఖచిత్రాలతో నూతన స్తూపం ఆవిష్కరించనున్నామని ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి తెలిపారు. అంతేకాకుండా రాష్ట్రంలోనే మొదటిసారిగా జిల్లాలో అమరవీరుల కుటుంబాలకు కాలనీ ఏర్పాటు చేశారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అడవుల్లో మావోయిస్టులు, పోలీసుల మధ్య తరచూ ఎదురుకాల్పులు జరిగేవి. పోలీసులు అడవుల్లోనే ఉంటూ మావోయిస్టుల గాలింపు చర్యలు చేపట్టేవారు. అడవులను జల్లెడ పడుతూ ఉండేవారు. ఎప్పుడేం జరుగుతుందనే భయం, ఆందోళనతో జీవనం సాగించేవారు. జిల్లా పోలీసు యంత్రాంగం ప్రజలతో సత్సంబంధాలు పెంచుకుంటూ, మావోయిస్టులపై పట్టు సాధించడానికి అనేక కార్యకలాపాలు చేపట్టేవారు. పోలీసులు ప్రజాస్వామ్య పరిరక్షణ, సమాజ శ్రేయస్సుకు అహర్నిశలు కృషి చేస్తూ ఉగ్రవాద చర్యలను ఎదుర్కొంటూ ప్రాణాలను సైతం ఫణంగా పెట్టారు. అలా అసువులు బాసిన అమర వీరులకు ప్రతి ఏటా జిల్లాలో అక్టోబర్ 18 నుండి 30 వరకు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు జరుపుకుంటారు. 1981 నుండి 1995 వరకు సంఘ విద్రోహ శక్తులతో పోరాడుతూ 48 మంది పోలీసులు అమరులయ్యారు. 1987లో కడెం మండలం అల్లంపల్లి అటవీ ప్రాంతంలో మావోయిస్టులు, పోలీసుల మధ్య భీకరమైన ఎదురుకాల్పుల్లో ఇద్దరు ఎస్సైలతో సహా 11 మంది పోలీసులు ప్రాణాలు అర్పించారు. ఉమ్మడి జిల్లాలో ఇదే అతిపెద్ద ఎన్‌కౌంటర్. ఈ ఘటన జ్ఞాపకార్థం పోలీస్ హెడ్‌క్వార్టర్‌లో మూడంతస్తుల భవనం నిర్మించి అల్లంపల్లి కాంప్లెక్స్‌గా నామకరణం చేశారు. 1991లో ఉట్నూర్ ఎస్ఐ కోట్యా నాయక్ మావోయిస్టులతో పోరాడి అసువులు బాశారు. ఆయన జ్ఞాపకార్థం చిల్డ్రన్ పార్క్ ఏర్పాటు చేశారు. 1993లో మంచిర్యాల సీసీసీ నస్పూర్‌లో మావోస్టుల తుపాకీ గుళ్లకు సీఐ చక్రపాణి, కానిస్టేబుల్ అశోక్ అమరులయ్యారు. సీఐ జ్ఞాపకార్థం చక్రపాణి మెమోరియల్ హాల్ నిర్మించారు. 2000లో బెల్లంపల్లి, మంచిర్యాల ప్రాంతాల్లో మావోయిస్టుల ఏరివేతలో ఏఆర్ హెడ్ కానిస్టేబుళ్లు శేషు, సంజీవ్ కీలక పాత్ర పోషించేవారు. వీరిని మావోయిస్టులు టార్గెట్ చేసి తుపాకులతో కాల్చి హత్య చేశారు. వీరి ఇద్దరి జ్ఞాపకార్థం పోలీస్ హెడ్ క్వార్టర్‌లో వ్యాయామశాల నిర్మాణం చేపట్టారు. 2015లో పోలీస్ అమరవీరుల కుటుంబాల కోసం పిట్టల్‌వాడ కాలనీలో ఏకంగా కోటి రూపాయల వ్యయంతో 48 మంది కుటుంబాల నివాసం కోసం కాలనీ ఏర్పాటు చేశారు.

పండుగ పూట పస్తులుంచుతారా..?

- హాస్టల్ డైలీవేజ్ వర్కర్ల యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ప్రభాకర్, మధు



నవతెలంగాణ-ఉట్నూర్

రాష్ట్రమంతా దసరా పండుగ చేసుకుంటుంటే గిరిజన సంక్షేమ శాఖలో పనిచేస్తున్న హాస్టల్ వర్కర్లను జీతాలు చెల్లించకుండా పండగ పూట పస్తులు ఉంచుతారా? అలని డైలీ వేజ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ప్రభాకర్, మధు ప్రశ్నించారు. శుక్రవారం ఐటీడీఏ కార్యాలయం ఆవరణలో డైలీవేజ్ వర్కర్లతో మాట్లాడారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐటీడీఏలో డైలీ వేజ్ వర్కర్లతో పని చేయించుకుంటూ పార్ట్ టైం జీతాలు చెల్లించడం విడ్డురంగా ఉందన్నారు. దసరా పండుగకు వర్కర్ల పరిస్థితి ఏంటని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్లలో పూర్తికాలం పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్, సానిటేషన్ వర్కర్లకు పెండింగ్‌లో ఉన్న 8 నెలల వేతనాలు చెల్లించాలని, లాక్‌డౌన్ కాలంలో వేతనాలు చెల్లించి, అందరిని పర్మినెంట్ చేయాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఐటీడీఏ పీఓ చాహత్ బాజ్‌పాయ్‌ని కలిసి సమస్యలపై వివరించి, వినతిపత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో గిరిజన హాస్టల్ డైలీ వైజ్ వర్కర్ల యూనియన్(సీఐటీయూ) జిల్లా అధ్యక్షులు బొజ్జ ఆశన్న, కుమురం భీం-ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షుడు జాదవ్ రాజేందర్, ప్రధాన కార్యదర్శి ముంజం శ్రీనివాస్, యూనియన్ నాయకులు మర్సుకోల కైలాస్, యూనియన్ ప్రధాన కార్యదర్శి మెస్రం సీతారాం, జిల్లా గౌరవ అధ్యక్షులు వెలిశాల క్రిష్ణమాచారి, యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు అరిగెల కోటయ్య, ఉమ్మడి జిల్లా నాయకులు ఆత్రం జంగుబాయి, మెస్రం లక్ష్మీ, నైతం, శోభ, రాజన్న పాల్గొన్నారు.

ప్రెస్‌క్లబ్ నూతన కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-భీమిని

మండల ప్రెస్‌క్లబ్ నూతన కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా గంగాకిషోర్ శర్మ, ఉపాధ్యక్షుడిగా గాధం శేఖర్, ప్రధాన కార్యదర్శిగా జంగేపల్లి శేఖర్, జాయింట్ సెక్రెటరీగా కొంక రవికుమార్, కోశాధికారిగా కామెరా సురేందర్, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా సంగర్స సంతోష్ కుమార్, దుర్గం సంతోష్ ఎన్నికయ్యారు. సాక్షులుగా గజ్జెల శ్రీధర్, పార్వతి అజయ్ పాల్గొన్నారు.



బీఆర్ఎస్ మేనిఫెస్టోతో విద్యార్థులకు చేసేదేమీ లేదు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

బీఆర్ఎస్ మేనిఫెస్టోతో విద్యార్థులకు చేసేదేమీ లేదని పీడీఎస్‌యూ అధ్యక్ష, కార్యదర్శులు సిడాం సాయికుమార్, కుమ్ర అశోక్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కుమురంభీం భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. విద్యారంగం, నిరుద్యోగంపై చిత్తశుద్ధి లేదని అన్నారు. బీఆర్ఎస్ మేనిఫెస్టోతో విద్యార్థులకు చేసేది ఎమి లేదని అన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వకుండా కుట్రపూరితంగా జ్యాప్యం చేస్తున్న కేసీఆర్ బీఆర్ఎస్ పార్టీ మేనిఫెస్టోలో విద్యారంగం,



నిరుద్యోగుల అంశం ఊసే లేదని అన్నారు. సీఎం కేసీఆర్‌కు విద్య, ఉపాధి, నిరుద్యోలపై కపటప్రేమ బయటపడిందన్నారు. విద్యారంగాన్ని ఎలా అభివృద్ధి చేస్తారో ఆయా పార్టీలు ఎన్నికల మేనిపెస్టోలో చెప్పాలన్నారు. గెలిచిన పార్టీలు వాటిని అమలు చేయాలన్నారు. సమావేశంలో నాయకులు కొరెంగ రవీందర్ మడవి రవి, పీవైఎల్ ప్రధాన కార్యదర్శి ఆత్రం వినోద్ పాల్గొన్నారు.

నందిగుండం ఆలయానికి భక్తుల పాదయాత్ర

నవతెలంగాణ-దిలావర్‌పూర్

మండల కేంద్రంలోని శ్రీరామ మందిరంలో, ఏకనాథ్ ఆలయంలో కొలువుదీరిన దుర్గాదేవి మాలాధారణ చేసిన స్వాములు, భక్తులు పెద్దసంఖ్యలో నందిగుండం దుర్గాదేవి ఆలయానికి శుక్రవారం పాదయాత్రగా బయలుదేరారు. ఈ సందర్భంగా స్వాములు మాట్లాడుతూ భక్తి శ్రద్ధలతో పాదయాత్రగా బయలుదేరి వెళ్లామని, దుర్గాదేవి కృపా కటాక్షం వల్లే సునాయాసంగా 20 కిలోమీటర్లు పాదయాత్ర చేయగలిగామని అన్నారు. ఈ పాదయాత్రలో భక్తులు అలూర్ రమణ, దాత్రిక శేఖర్, బూర్ల శ్రీనివాస్, నంద సందీప్, కదం రమేష్, నవ్య, దీక్షిత, సత్యబాయి, పుష్ప, సాగరబాయి, సుష్మిత పాల్గొన్నారు.



అభివృద్ధిని చూసి ఓటెయ్యాలి



నవతెలంగాణ-సారంగాపూర్

తెలంగాణ ప్రభుత్వం సీఎం కేసీఆర్ సారథ్యంలో నిర్మల్ నియోజకవర్గాన్ని మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి చేసిన అభివృద్ధిని చూసి ఓటు వేయాలని మండల ఇన్‌చార్జీ అల్లోల మురళీధర్‌రెడ్డి, రైతుబంధు అధ్యక్షులు వెంకట్ రామ్‌రెడ్డిలు అన్నారు. శుక్రవారం మండలంలోని దుర్గానగర్, సేవాదాస్‌నగర్, హన్మాంత్ తండా, లక్ష్మి నగర్, బోరింగ్ తండా, యాకర్‌పల్లి గ్రామాలలో బీఆర్ఎస్ పార్టీ అధ్వర్యంలో ప్రచారం చేశారు. కారు గుర్తుకు ఓటువేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ ప్రచారంలో పార్టీ మండల కన్వీనర్ మాధవరావు, ఎంపీపీ అట్ల మహిపాల్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఆశ్రిత శ్రీనివాస్‌రెడ్డి, అడెల్లి చైర్మెన్ చందు, మాజీ ఎఎంసి చైర్మెన్‌లు రాజ్ మమ్మద్, రవీందర్‌రెడ్డి, ఎంపీటీసీ రాజు సర్పంచ్‌లు రవీందర్, రాజు, రమణ నాయకులు కండేలా భోజన్న, దీనేష్‌లు పాల్గొన్నారు.

ముథోల్ : సీఎం కేసీఆర్ చేసిన అభివృద్ధిని చూసి ఓటు వేయాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు అఫ్రోజ్ ఖాన్ అన్నారు. శుక్రవారం మండలంలోని రాంటేక్, మచ్కల్ గ్రామంలో ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. అభివృద్ధిని చూసి బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి విఠల్‌రెడ్డికి ఓటు వేయాలని అభ్యర్థించారు. గ్రామాలను అన్ని రంగాలతో పాటు, ముథోల్ నియోజకవర్గం అభివృద్ధికి బాటలను వేశారన్నారు. ప్రభుత్వం పేద ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేసిందన్నారు. రానున్న ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల రైతుబంధు అధ్యక్షుడు రామ్‌రెడ్డి, మండల కోఆప్షన్ సభ్యులు సయ్యద్ ఖాలిద్, మాజీ పీఏసీఎస్ చైర్మెన్ సురేందర్‌రెడ్డి, స్థానిక ఎంపీటీసీ ఆత్మస్వరూప్, నాయకులు భుజంగరావు పటేల్, జైభీమ్, గోవింద్ పటేల్, పోతన్న యాదవ్, శ్రీనివాస్‌గౌడ్, రవింధర్‌రెడ్డి, రమేష్, గంగాధర్, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

గడపగడపకు కాంగ్రెస్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పట్టణంలోని పలు కాలనీల్లో కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత, మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ అల్లూరి సంజీవ్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు పార్టీని ఆదరించి ఓటేయలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో రాగానే మొదటి సంతకం 6 గ్యారంటీలపైనే ఉంటుందని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో అశోక్, రిజ్వాన్, మైనారిటీ టౌన్ జనరల్ సెక్రటరీ అధ్యక్షులు వసీమ్, ముర్తుజా, హనీఫ్, నసీం, గండ్రత్ వెంకట్ నాయకులు ఉన్నారు.

సేవాలాల్ మహారాజ్ ఆలయంలో ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-నార్నూర్

శరన్నవరాత్రులను పురస్కరించుకొని శుక్రవారం మండల కేంద్రంతో పాటు తాడిహత్నూర్, మదాపూర్ తదితర గ్రామాల్లో భక్తులు దుర్గామాత, జగదాంబదేవి, సేవాలాల్ మహారాజ్ ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మాదాపూర్ గ్రామంలో దుర్గామాతకు జెడ్పీ చైర్మెన్ జనార్ధన్ రాథోడ్ ప్రత్యేక పూజలు చేశారు. శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మహిళలు ఉపవాసం ఉండి భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రిపూట మహిళలలు, యువకులు దాండియా పాటల మీద నృత్యాలు చేశారు.

కాంగ్రెస్‌లో చేరిన నారాయణరావు పటేల్



నవతెలంగాణ-ముథోల్

ముథోల్ మాజీ ఎమ్మెల్యే నారాయణరావు పటేల్ శుక్రవారం కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ కాంగ్రెస్ సభలో మాజీ ఎమ్మెల్యే నారాయణరావు పటేల్, ఆయన కుమారుడు ప్రముఖ పారిశ్రామికవేత్త అఖిలేష్ పటేల్‌లకు రాహుల్ గాంధీ పార్టీ కండువాలు కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. ముథోల్ నియోజకవర్గంలో రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండాను ఎగురవేస్తామని పటేల్ పేర్కొన్నారు.

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-కుభీర్

మద్యానికి బానిసై ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని పార్డి(బి) గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పార్డి(బి) గ్రామానికి చెందిన మక్రే బాబల్(52) గత కొంత కాలంగా మద్యం తాగుతూ ఉండేవాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఉన్న దూలానికి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య రామబాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎండీ షరీఫ్ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

ఆర్థిక సాయం అందజేత

నవతెలంగాణ-నార్నూర్

మండలంలోని మాదాపూర్ గ్రామానికి చెందిన మాజీ ఉపసర్పంచ్ కాంబ్లే త్రిముఖ్ వారం రోజుల కింద అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న జెడ్పీ చైర్మెన్ జనార్ధన్ రాథోడ్ శుక్రవారం గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. తనవంతు ఆర్థిక సాయాన్ని అందించారు. వారి వెంట ఖైర్‌డాట్వా సర్పంచ్ కనక సేవంతా ప్రభాకర్, ఆనంద్‌రావ్, నాయకులు మర్సుకొల తిరుపతి, కే మహేందర్, మానిక్ రావ్, బాలాజీ, హనుమంతు, వెంకటి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

విద్యుత్ నెలవారి మరమ్మతుల కారణంగా పట్టణంలోని కైలాస్‌నగర్ సబ్ స్టేషన్ పరిదిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ ఒక ప్రకటనలో తెలిపారు. శాంతినగర్, కైలాస్‌నగర్, అటెండర్స్ కాలనీ, ఆర్‌ఆర్ నగర్, ఓల్డ్ హౌసింగ్ బోర్డు కాలనీలలో ఉదయం 10:00 గంటల నుంచి మధ్యాహ్నం 1:00 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు. ఆయా సబ్ స్టేషన్ల పరిధిలోని వినియోగదారులందరూ సహకరించాలని కోరారు.

ప్రజల ఆశీర్వాదంతో బీఆర్ఎస్ హ్యాట్రిక్ సాధిస్తుంది

- అభివృద్ధి, సంక్షేమ పథకాలే విజయానికి సోపానాలు
- బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి



ఎన్నికల ప్రచార సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి

నవతెలంగాణ-దిలావర్‌పూర్

ప్రజల ఆశీర్వాదంతోనే బీఆర్ఎస్ హ్యాట్రిక్ సాధిస్తుందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలో ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రచార రథంతో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో దిలావర్‌పూర్, నర్సాపూర్(జి) మండలాల నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. ముందుగా చాకలి ఐలమ్మ, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేశారు. అనంతరం సిర్గాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కాంగ్రెస్, బీజేపీ పార్టీకి చెందిన పలువురు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా సిర్గాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఐకేరెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి మండల ఎన్నికల ఇన్‌చార్జి రంజిత్‌ను నియమించామని ప్రకటించారు. సీఎం కేసీఆర్ సారథ్యంలో నీళ్లు, నిధులు, నియామకాల పేరుతో పోరాడి తెలంగాణ సాధించుకున్నామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలే పార్టీ విజయానికి సోపానాలని పేర్కొన్నారు. రైతుబంధు పదహారు వేలు కాబోతుందని, రైతుబీమా, రైతుబంధు పథకాలను, 24 గంటల ఉచిత విద్యుత్తును దేశంలో ఒక తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం మాత్రమే అందిస్తుందన్నారు. వృద్దులకు, వితంతువులకు, వికలాంగులకు రూ.5016ల పెన్షన్ అందజేస్తామని, సిలెండర్ ధర కేవలం 400 మాత్రమే చేస్తామని తెలిపారు. బీఆర్ఎస్ పాలించిన తొమ్మిదిన్నర ఏండ్లలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, బీఆర్ఎస్ మేనిఫెస్టోను వివరిస్తూ ప్రజలను ఓట్లు అడుగుతామని వివరించారు. బీఆర్ఎస్ మేనిపెస్టో అన్ని వర్గాల అభ్యున్నతికి తోడ్పడే విధంగా ఉందని, బీఆర్ఎస్ పార్టీ హ్యాట్రిక్ విజయం సాధించడం ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రతీ కార్యకర్త కష్టపడి పనిచేసి పార్టీని గెలిపించేందుకు కృషిచేయాలని, ప్రతి పక్షాల జిమ్మిక్కులకు అడ్డుకట్ట వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మండల బీఆర్ఎస్ కన్వీనర్ దేవేందర్‌రెడ్డి, యు.సుభాష్, పీఏసీఎస్ చైర్మెన్ రమణరెడ్డి, పాల్దె అనిల్, కోండ్ర రమేష్, బాబురావు, అన్వర్, కోడె రాజేశ్వర్, దనె రవి, రాంరెడ్డి, గుణవంత్ రావు, సప్పల రవి, ఒడ్నం కృష్ణ, పాల్దె శ్రీనివాస్, అశోక్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తా..

- బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్ జాదవ్



యువకులతో కలిసి ప్రచారాన్ని ప్రారంభించిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్ జాదవ్

నవతెలంగాణ-సిరికొండ

రానున్న ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి తనను ఆదరించాలని, నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపిస్తానని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్ జాదవ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఎన్నిక శంఖారావాన్ని పూరించాడు. ముందుగా పొన్న ఎక్స్ రోడ్ నుంచి బైక్ ర్యాలీ నిర్వహించారు. మండల కేంద్రంలోని గాంధీ చౌక్‌లోని గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కొందరు పగటిపూట వేశగాల్లు ఊళ్లోకి వచ్చి మాయ మాటలు చెప్తారని అన్నారు. ఆ మాటలు విని మోసపోవద్దని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్నటువంటి అభివృద్ధి సంక్షేమ పథకాలు చూసి ప్రజలంతా బీఆర్ఎస్ వైపు చూస్తున్నారని తెలిపారు. అది చూసి ఓర్వలేక కొందరు లేనిపోని ఆరోపణలు చేస్తారని అన్నారు. రానున్న ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని అన్నారు. మండలానికి డబుల్ రోడ్, చిక్మన్ ప్రాజెక్ట్ రీ డిజైన్ చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం నియోజకవర్గ ఎన్నికల ఇన్‌ఛార్జి, మాజీ ఎంపీ గోడం నగేష్ మాట్లాడారు ఎంపీగా ఉన్న సమయంలో మండలంలోని పలు గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలనే ఉద్యేశంతో భూమిపూజ చేశామని కానీ కొందరు కనీసం అటవీ శాఖ అనుమతులు కూడా తీసుకురాకుండా, అలాగే పెండింగ్‌లో ఉంచారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు ప్రతి ఇంటింటికీ చేరాయని అన్నారు. బోథ్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్ జాదవ్‌ని గెలిపించాలని మండలాన్ని మరింత అభివృద్ధి చేస్తామని అన్నారు. అనంతరం బీజేపీ పార్టీకి చెందిన పలువురు యువకులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో సిరికొండ సర్పంచ్ నర్మద పెంటన్న, ఎంపీటీసీ పర్వీన్ లతీఫ్, ఉపసర్పంచ్ తోకల చిన్న రాజన్న, నాయకులు ఇక్బాల్, మల్లారెడ్డి, కృష్ణ కుమార్, సూర్యకాంత్, జింక లక్ష్మణ్, గొర్ల రాజన్న, ప్రకాష్ పాల్గొన్నారు.

ప్రజలకు అండగా బీఆర్ఎస్



ఎన్నికల ప్రచార ర్యాలీలో పాల్గొన్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జోగు రామన్న

నవతెలంగాణ-బేల

బీఆర్ఎస్ పార్టీపై ప్రజలు తమ అభిమానాన్ని చూపుతున్నారని, ప్రజలకు బీఆర్ఎస్ అన్ని విధాల అండగా ఉంటుందని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. శుక్రవారం సిర్సన్న గ్రామం నుంచి బైక్ ర్యాలీ నిర్వహించారు. అదేవిధంగా సదల్‌పూర్‌లోని భైరాందేవ్, మహాదేవ్ ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటి సభ్యులు ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. మండల కేంద్రంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో ప్రజలు చూపుతున్న ఆదరణ చూస్తుంటే, గత ఎన్నికల్లో వచ్చిన మెజారిటీ కంటే రెట్టింపు మెజారిటీతో విజయం దక్కే అవకాశం ఉన్నట్లు కనబడుతోందని అన్నారు. కాంగ్రెస్ హయంలో ప్రజలు అనేక ఇబ్బందులను ఎదుర్కొన్నారని అన్నారు. తెలంగాణలో అమలు చేస్తున్న పథకాలు తమ రాష్ట్రంలో లేవని ఇతర రాష్ట్రాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఉన్నతమైన పథకాలతో యావత్ దేశం దృష్టిని తెలంగాణ ఆకర్షిస్తోందన్నారు. సీఎం కేసీఆర్ ప్రజలకు ఇచ్చిన హామీలనే కాకుండా ఇవ్వని హామీలను సైతం అమలు చేశారని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ హయంలో వ్యక్తుల పేర్లపై పథకాలు అమలు చేశారని, కాని ప్రస్తుతం బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో ప్రజల కోసం, ప్రజా క్షేమం కోసం పథకాలను ప్రవేశాపెట్టారని అన్నారు.కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మెన్ రావుత్ మనోహర్, డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి, మార్కెట్ కమిటి మాజీ చైర్మెన్ యాసం నర్సింగ్‌రావు, బీఆర్ఎస్ నాయకులు గంభీర్ ఠాక్రే, సతీష్ పవార్, పార్టీ మండల అధ్యక్షులు కళ్లెం ప్రమోద్‌రెడ్డి, దేవన్న, తన్వీర్ ఖాన్, జక్కుల మధుకర్, బండి సుదర్శన్ పాల్గొన్నారు.

మైనార్టీలను మోసం చేసిన కేసీఆర్‌కు బుద్ధి చెప్పాలి

- కాంగ్రెస్ అభ్యర్థి, డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు



కాంగ్రెస్‌లో పార్టీలో చేరిన మహిళలు, యువకులు

నవతెలంగాణ-నిర్మల్

బూటకపు మాటలు, అబద్ధపు హామీలతో మైనార్టీలను మోసం చేసిన బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్‌కు రానున్న ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని నిర్మల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి, డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని గుల్జార్ మస్జిద్, చాంద్ మస్జిద్ వద్ద ఎన్నికల ప్రచారం నిర్వహించి, మైనార్టీలను కలిశారు. సోనియా గాంధీ ప్రకటించిన ఆరు హామీల పథకాలను వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిర్మల్ పట్టణంలో హజ్ హౌస్, షాదిఖానా, కమ్యూనిటీ భవనం నిర్మిస్తానని చెప్పిన మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ముస్లింలను తీవ్రంగా మోసం చేశారని మండిపడ్డారు. మైనార్టీలకు 12 శాతం రిజర్వేషన్ కల్పిస్తానని ఇచ్చిన హామీని సీఎం కేసీఆర్ విస్మరించారని అన్నారు. ముస్లింలందరూ సత్తా చాటి వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేస్తున్నానని హస్తం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక...

నిర్మల్ నియోజకవర్గంలోని సోన్ మండలం సాకెర గ్రామ ఉపసర్పంచ్ సతీష్, భాగ్యనగర్ మాజీ సర్పంచ్ భోజన్న, టెంబుర్ని గ్రామ బీఆర్ఎస్ నాయకులు నగేష్, గంగపుత్ర సభ్యులు పెద్ద సాయన్న, శ్యామ్ సుందర్ లు శుక్రవారం కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో నాయకులు గోవింద్‌రెడ్డి, సాగర్‌రెడ్డి, అరుగుల రమణ, మధుకర్‌రెడ్డి, రాజనరసింహ రెడ్డి, పవన్, సాద సుదర్శన్, భీమ్‌రెడ్డి పాల్గొన్నారు.

వామపక్షాలు మద్దతు తెలిపిన పార్టీకే ఓటేయాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పాలకులు అవినీతి, అక్రమాలకు పాల్పడి ప్రజలను విచ్చలవిడిగా దోచుకున్నారు. తప్పితే బీఆర్ఎస్ హయాంలో ఎక్కడా అభివృద్ధి జరగలేదని సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి ధ్వజ మెత్తారు. శుక్రవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ నాయకులు కొట్లాది రూపాయలు కొల్లగొట్టి అభివృద్ధిని విస్మరించారని మండిపడ్డారు. కేసీఆర్‌ది అబద్ధాల, అవినీతి పాలన అంటూ విమర్శించారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లోనూ డబ్బులు వెదజల్లి ఓటర్లను కొనుగోలు చేసేందుకు చూస్తున్నారని అన్నారు. తాయిళాలతో మభ్యపెట్టాలనుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్‌కు పాలనకు ఇక చరమగీతం పాడాల్సిందేనని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడే, వామపక్షాలు మద్దతిచ్చే పార్టీకే తమ అమూల్యమైన ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో నాయకులు ఉన్నారు.

సీఎం కేసీఆర్ క్షమాపణ చెప్పాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సీఎం కేసీఆర్ ఇటీవల ఓ సభలో చేసిన అనుచిత వ్యాఖ్యలపై దళితసంఘాలు ఆందోళనకు దిగాయి. దళితబంధు విషయంలో వ్యంగంగా మాట్లాడాన్ని నిరసిస్తూ శుక్రవారం స్థానిక అంబేద్కర్ చౌక్‌లో దళిత, బీసీ సంఘాల నాయకులు శోభ, నారాయణ నేతృత్వంలో ఆందోళనకు దిగారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రైతుబంధుకు రాంరాం, దళితబంధుకు జైభీమ్ అంటూ ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన అనుచిత వ్యాఖ్యలు తమ మనోభావాలను దెబ్బతీసే విధంగా ఉన్నాయని అన్నారు. రాజ్యాంగా నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ పట్ల సీఎం కేసీఆర్ వైఖరిని తప్పుబట్టారు. చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకుని బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాబోయే రోజుల్లో తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు.

పత్తి కొనుగోళ్లకు ఏర్పాట్లు పూర్తి చేయాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌అర్బన్

పత్తి కొనుగోళ్లను ప్రారంభించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పీఎస్. అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక వ్యవసాయ మార్కెట్‌ను సందర్శించి, పత్తి కొనుగోళ్లకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు పండించిన పత్తి పంటకు కనీస మద్దతు ధర కల్పించి, కొనుగోలు చేయడం జరుగుతుందని అన్నారు. పత్తి కొనుగోళ్ల ప్రారంభం దృష్ట్యా మార్కెట్ యార్డులలో తూకం మిషన్‌లను, తేమ కొలిచే యంత్రాలు, మౌలిక వసతులు, తదితర ఏర్పాట్లను వెంటనే పూర్తిచేయాలని మార్కెటింగ్ అధికారులను ఆదేశించారు. ట్రేడర్స్, రైతు సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించి, వారి సూచనలను పరిగణలోకి తీసుకొని త్వరలోనే కొనుగోళ్లను ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ అధికారి శ్రీనివాస్, సంబంధిత అధికారులు, ట్రేడర్లు పాల్గొన్నారు.

అసెంబ్లీ ఎన్నికల్లో బరిలోకి ఆదివాసీ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఆదివాసీల తరపున ఆదిలాబాద్ నియోజకవర్గం నుంచి స్వతంత్ర ఎమ్మెల్యే అభ్యర్థిగా గేడం జనార్ధన్‌ను బరిలోకి దింపుతున్నట్టు ఆదివాసీ నాయకులు కినక సురేష్ తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 33 శాతం ఆదివాసులు ఉన్నారని, కానీ నాటి నుంచి నేటి వరకు ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు వెనుకడుగు వేస్తున్నారన్నారు. అందుకే ఈసారి ఏ రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా ఆదివాసుల తరపున గేడం జనార్ధన్‌ను పోటీలో నిలుపుతున్నామన్నారు. ఓటర్లు ఆశీర్వదించి గెలిపించాలని కోరారు. అంతకుముందు జనార్ధన్‌ను శాలువా, పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు ఉన్నారు.

పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రాబోయే శీతాకాల పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి చట్ట బద్ధత కల్పించాలని టీఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మాల్యాల మనోజ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఏ రాజకీయ పార్టీ మాదిగలు, మాదిగ ఉప కులాలకు అనుకూలంగా వ్యవహరిస్తోందో ఆ పార్టీకే తమ సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. ఎస్సీ వర్గీకరణపై చట్ట బద్ధత కల్పించేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు మరో పోరాటానికి సిద్ధం కావాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు ఉన్నారు.

నవతెలంగాణ
నమ్మదగిన తెలుగు దినపత్రిక
కుమురంభీం ఆసిఫాబాద్
శనివారం | అక్టోబర్ 21, 2023 | www.navatelangana.com

ఉద్యమంలో గాయకుల పాత్ర వెలకట్టలేనిది

నవతెలంగాణ-ఆసిఫాబాద్



తెలంగాణ ఉద్యమంలో గాయకుల పాత్ర ఎంతో ముఖ్యమైనదని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్, ఆసిఫాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి కోవలక్ష్మి అన్నారు. తెలంగాణ ఉద్యమ గాయకుడు ఇర్ఫాన్ రాసి పాడిన పాటల సీడీని శుక్రవారం ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉద్యమంలో గాయకులు తమ వెంట ఉన్నారని తెలిపారు. ఇప్పటివరకు రాష్ట్ర అభివృద్ధిలో కూడా తమతో కలిసి వచ్చారన్నారు. రాష్ట్ర సాధనలో వారి పాత్ర వెలకట్టలేనిదని గుర్తుచేశారు. భవిష్యత్తులో కూడా ఇదే సహకారాన్ని అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొమ్మినేని శ్రీధర్, జాకీర్ పాల్గొన్నారు.

విద్యార్థినీలకు శ్రీలత ఆదర్శం

నవతెలంగాణ-ఆసిఫాబాద్



ఏఈఓగా ఉద్యోగం సాధించి విధులు కొనసాగిస్తున్న ధరావత్ శ్రీలత విద్యార్థినీలకు ఆదర్శమని సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ అహ్మద్ అన్నారు. మండలంలోని అడ దస్నాపూర్‌కు చెందిన శ్రీలత ఏఈఓగా ఉద్యోగం సాధించి చింతలమానపెల్లిలో విధులు నిర్వహిస్తూ తొలిసారి పీఏసీఎస్‌కు వచ్చిన ఆమెను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెనుకబడిన ప్రాంతంలో ఉండి కూడా శ్రీలత ఉన్నత స్థాయికి ఎదగడం సంతోషంగా ఉందని, ఆమె మరింత మంది విద్యార్థులకు ఆదర్శంగా నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన బాదు పటేల్ పాల్గొన్నారు.

గూడెం చెక్‌పోస్ట్ వద్ద నగదు పట్టివేత



నవతెలంగాణ - చింతలమానేపల్లి

మండలంలోని గూడెం చెక్‌పోస్ట్ వద్ద శుక్రవారం రూ.1.50లక్షలు పట్టుకున్నామని ఎస్ఐ వెంకటేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్ర అహీరి గ్రామం నుండి చంద్రపూర్ వెళ్తున్న తరుణ్ అహుజ వద్ద నగదు పట్టుబడిందన్నారు. దీనికి ఎటువంటి పత్రాలు లేనందున నగదు సీజ్ చేశామని ఎస్ఐ పేర్కొన్నారు.

నాటుసారా తయారుచేస్తే కఠిన చర్యలు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

నాటుసారా తయారుచేసినా, విక్రయించినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సీఐ మంగమ్మ హెచ్చరించారు. శుక్రవారం తన కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన తర్వాత ఇప్పటి వరకు 20 కేసులు నమోదు చేసి 12 మందిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. 145 లీటర్ల నాటుసారా, 11.34 లీటర్ల దేశీదారు, 16.15 లీటర్ల మద్యం, 40కిలోల ఆలం, మూడు వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. నాటుసారా తయారీకి ఉపయోగించే 3,700 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసినట్లు వెల్లడించారు.

నవంబర్ 6లోపు రీకౌంటింగ్‌కు దరఖాస్తు చేసుకోవాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

డీఈడీ ద్వితీయ సంవత్సరం విద్యార్థుల ఫలితాలు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని, ఫలితాల రీకౌంటింగ్‌కు నవంబర్ 6లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాధికారి అశోక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థులు తమ ఫలితాలు వెబ్ సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఎస్ఈ.తెలంగాణ.జీఓవీ.ఇన్‌లో చూసి రీకౌంటింగ్ అవసరమైతే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

బీజేపీ తాలుకా అధికార ప్రతినిధిగా సత్యనారాయణ

నవతెలంగాణ-సిర్పూర్(టి)

బీఆర్ఎస్‌కు రాజీనామ చేసి బీజేపీలోకి చేరిన జిల్లా గ్రంథాలయం డైరెక్టర్ నేరేటి సత్యనారాయణకు పార్టీ తాలుక అధికార ప్రతినిధిగా నియమించింది. సతీమణి జెడ్పీటీసీ నేరేటి రేఖతో కలిసి ఆయన గత నెలలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు. శుక్రవారం సిర్పూర్ తాలుకా పార్టీ అధికార ప్రతినిధిగా ఆయనను నియమించినట్టు జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ తెలిపారు. నేటి నుండి పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి బలోపేతానికి కృషి చేయాలని, రాబోయే ఎన్నికల్లో నియోజకవర్గంలో బీజేపీని విజయం దిశగా తీసుకెళ్లాలని సూచించారు.

చంద్రబాబు విడుదల కావాలని ప్రార్థన



నవతెలంగాణ-కాగజ్‌నగర్

తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడుపై పెట్టిన అక్రమ కేసులు కొట్టేసి జైలు నుండి విడుదల కావాలని కోరుతూ శుక్రవారం టీడీపీ సిర్పూరు నియోజకవర్గ అధ్యక్షులు జి ఆనంద్-లావణ్య దంపతులు ప్రార్థనలు చేశారు. స్థానిక శ్రీ లక్ష్మి నారాయణస్వామి ఆలయంలోని కనకదుర్గ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం చిన్నారులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

రేపు సద్దుల బతుకమ్మ వేడుకలు

నవతెలంగాణ - రెబ్బెన

తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీకైన బతుకమ్మ పండుగను గోలేటి సింగరేణి హైస్కూల్ మైదానం, మాదారం రామాలయం ప్రాంగణంలో నిర్వహించడానికి ఏర్పాట్లు చేయనున్నట్టు బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ డి రవిప్రసాద్ తెలిపారు. 22న ఆదివారం సాయంత్రం ఆరు గంటల నుండి సద్దుల బతుకమ్మ ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. ప్రతి ఒక్కరు బతుకమ్మను అందంగా అలంకరించి తీసుకురావాలని, బతుకమ్మలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేయనున్నట్టు తెలిపారు. మరో 10 బతుకమ్మలకు కూడా ప్రోత్సాహక బహుమతులు ఇవ్వనున్నట్టు తెలిపారు. సింగరేణి యాజమాన్యం ఏర్పాటు చేసిన వేదిక వద్దకు రాత్రి తొమ్మిది గంటలలోపు వచ్చిన బతుకమ్మలే పోటీకి అనుమతించబడుతాయన్నారు. బతుకమ్మ ఆటాపాట కార్యక్రమంలో సింగరేణి ఉద్యోగులు, కుటుంబీకులు, పరిసర ప్రాంతాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత

నవతెలంగాణ - రెబ్బెన

దైనొందిన జీవితంలో ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలని బెల్లంపల్లి ఏరియా జీఎం డి రవిప్రసాద్ అన్నారు. శుక్రవారం ఖైరిగూడ ఓసీపీ ఆవరణలో దుర్గామాత ఆలయంలో ఏరియా అధికారులతో కలిసి జీఎం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుంకుమార్చనలో పాల్గొన్నారు. సమీప గ్రామాల నుండి భక్తులు తరలివచ్చి పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓ ఎస్ సత్యనారాయణ, గోలేటి ఓసీ పీఓ ఉమాకాంత్, అన్ని విభాగాల అధిపతులు పాల్గొన్నారు.



హేమాహేమీలే గెలిచారు..!

• సిర్పూర్(టి) నియోజకవర్గం ఎన్నికల ముఖచిత్రం

సంఖ్యా పరంగా చూస్తే ఆ నియోజకవర్గం నెంబర్ వన్. ఈ నియోజకవర్గం నుండి గెలిచిన వారంతా కూడా రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందినవారే. ఒక్కొక్కరు రెండేసి సార్లు విజయం సాధించగా గెలుపొందిన ఎమ్మెల్యేలు రాష్ట్రస్థాయి పదవులను చేజిక్కించుకొని నియోజకవర్గం పేరును చరిత్ర పుటల్లోకి ఎక్కించారు. ఆ నియోజకవర్గమే సిర్పూర్(టి). ఈ నియోజకవర్గంలో 2018 వరకు ప్రతి ఒక్కరూ రెండుసార్లు చొప్పున ఎమ్మెల్యేలుగా గెలుపొందగా, ఒక్క కోనేరు కోనప్పనే ఈ నియోజకవర్గం నుండి మూడుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు.



సిర్పూరు నియోజకవర్గ ముఖచిత్రం

నవతెలంగాణ - కాగజ్‌నగర్

పారిశ్రామిక కేంద్రంగా పేరుగాంచిన సిర్పూరు శాసనసభా నియోజకవర్గం 1952లో ఏర్పడింది. అప్పటి నుండి ఇప్పటి వరకు 16 సార్లు ఎన్నికలు జరిగాయి. 1957లో మాత్రం ద్విసభ్య నియోజకవర్గంగా ఉంది. ఆ సమయంలో రెండు స్థానాలు ఉండగా, ఒకటి కాంగ్రెస్, మరొకటి ప్రజాసోషలిస్టు పార్టీ గెలుచుకున్నాయి. ఈ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ఆరుసార్లు గెలుపొందగా తెలుగుదేశం మూడుసార్లు, బీఆర్ఎస్ (అప్పట్లో టీఆర్ఎస్) మూడుసార్లు, సోషలిస్టు పార్టీ, ప్రజాసోషలిస్టు పార్టీ, బహుజన సమాజ్ పార్టీ అభ్యర్థులు ఒక్కసారి గెలుపొందారు. స్వతంత్ర అభ్యర్థిగా పాల్వాయి పురుషోత్తంరావు ఒక్కడే రెండు సార్లు ఈ నియోజకవర్గంలో గెలుపొందారు. ఈ నియోజకవర్గం నుండి గెలుపొందిన వారిలో మహామహులు ఉన్నారు. ప్రముఖ దళిత నేత కోదాటి రాజమల్లు, వెంకటస్వామి, కార్మికనేత జి సంజీవరెడ్డి, స్వాతంత్ర్య సమరయోధుడు కెవి కేశవులు ఇక్కడి నుండి గెలుపొందారు. కోదాటి రాజమల్లు 1957లో ఇక్కడ ప్రజాసోషలిస్టు పార్టీ పక్షాన గెలువగా, 1952లో లక్షెట్టిపేటలో సోషలిస్టు పార్టీ నుండి గెలుపొందారు. 1962 నుండి మూడుసార్లు చెన్నూరు నుండి గెలుపొందారు. మొత్తం మీద ఈయన ఐదుసార్లు శాసనసభకు ఎన్నికయ్యారు. సంజీవరెడ్డి కాంగ్రెస్ అభ్యర్థిగా రెండుసార్లు, కేవీ కేశవులు కాంగ్రెస్ పక్షాన రెండుసార్లు, తెలుగుదేశం అభ్యర్థిగా కేవీ రెండుసార్లు, ఇండిపెండెంట్‌గా పాల్వాయి పురుషోత్తంరావు రెండు సార్లు ఇక్కడ గెలుపొందారు. 1999 ఎన్నికల సమయంలో పురుషోత్తంరావు టీడీపీలో ఆ పార్టీ అభ్యర్థిగా బరిలో నిలిచారు. కాని ఆ ఎన్నికలకు రెండు రోజుల ముందు నక్సల్స్ కాల్పులకు గురై మరణించారు.

అనంతరం జరిగిన ఎన్నికలలో టీడీపీ నుండి పురుషోత్తంరావు సతీమణి రాజ్యలక్ష్మి గెలుపొందారు. 2004లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కోనేరు కోనప్ప విజయం సాధించారు. 2009లో టీఆర్ఎస్ (బీఆర్ఎస్‌)క్మి అభ్యర్థి కావేటి సమ్మయ్య గెలుపొందారు. తెలంగాణ ఉద్యమంలో భాగంగా ఏడాదికే ఆయన రాజీనామా చేశారు. 2010లో జరిగిన ఉప ఎన్నికలో కూడా కావేటి సమ్మయ్య మళ్లీ విజయం సాధించారు.

సిర్పూరు అసెంబ్లీ విజేతలు, పరాజితులు వీరే..

సం॥	మొత్తం ఓట్లు	గెలిచిన అభ్యర్థి	ఓట్లు	ప్రత్యర్థి	ఓట్లు
1952	48,866	ఎం బుచ్చయ్య(సోషలిస్టు)	8990	టిఎస్‌రావు	7,205
1957	1,97,572	కె రాజమల్లు(పిఎస్‌పి)	24666	ఎస్‌రెడ్డి	18,262
	1,97,572	వెంకటస్వామి(కాం)	25797	రామన్న	16,976
1962	52,754	జి సంజీవరెడ్డి(కాం)	16459	బలరామయ్య	2,078
1967	69,301	జి సంజీవరెడ్డి(కాం)	14564	ముక్తేశ్వరసింగ్	8,739
1972	78,936	కెవి కేశవులు(కాం)	25684	బిసి గౌడ్	16,082
1978	86,428	కెవి కేశవులు(కాం)	21210	సి మాధవరెడ్డి	14,424
1983	96,320	కెవి నారాయణరావు(టిడిపి)	28623	కెవి కేశవులు	17,966
1985	1,03,852	కెవి నారాయణరావు(టిడిపి)	34619	జనక్‌ప్రసాద్	26,354
1989	1,21,504	పి పురుషోత్తంరావు(ఇం)	25860	కేవీఎస్ రావు	23,419
1994	1,33,108	పి పురుషోత్తంరావు(ఇం)	47539	కేవీఎస్ రావు	35,271
1999	1,49,332	పి రాజ్యలక్ష్మి(టిడిపి)	57318	కోనేరు కోనప్ప	27,351
2004	1,56,283	కోనేరు కోనప్ప(కాం)	55938	పి రాజ్యలక్ష్మి	51,619
2009		కావేటి సమ్మయ్య(టిఆర్ఎస్	47918	కోనేరు కోనప్ప	40,535
2010	1,26,957	కావేటిసమ్మయ్యటిఆర్ఎస్	56241	ఇంద్రకరణ్‌రెడ్డి	41,027
2014	1,90,762	కోనేరు కోనప్ప (బీఎస్పీ)	49,033	కావేటిసమ్మయ్య	40196
2018	1,90,934	కోనేరు కోనప్ప (టీఆర్ఎస్)	82,957	హరీష్‌బాబు	58,813



జి వెంకటస్వామి



జి సంజీవరెడ్డి



కేవి కేశవులు



కేవీ నారాయణరావు



పురుషోత్తంరావు



పాల్వాయి రాజ్యలక్ష్మి



కోనేరు కోనప్ప



కావేటి సమ్మయ్య

హాకీ విజేతలకు బహుమతులు అందజేసిన డైరెక్టర్

నవతెలంగాణ-మంచిర్యాల

కంపెనీ లెవెల్ హాకీ ఫైనల్ పోటీలో విజయం సాధించిన జట్టుకు ఈఅండ్ఎం డైరెక్టర్ సత్యనారాయణ రావు, ఏరియా జనరల్ మేనేజర్ సంజీవరెడ్డి బహుమతులను అందించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ సింగరేణి సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులు వివిధ క్రీడాంశాలలో ప్రతిభను చాటడం చాలా సంతోషకరమైన విషయమన్నారు. సింగరేణి స్థాయి హాకీ పోటీలు శ్రీరాంపూర్ ఏరియాలో నిర్వహించడం అభినందనీయమన్నారు. కోల్ ఇండియా స్థాయిలో క్రీడాకారులు తమ ప్రతిభను చాటి సింగరేణి సంస్థ పేరు తీసుకురావాన్నారు. ఫైనల్ పోటీలలో కొత్తగూడెం కార్పొరేట్ జట్టు ప్రథమ బహుమతి రాగా శ్రీరాంపూర్ ఏరియా జట్టుకు ద్వితీయ బహుమతి లభించింది. ఈ కార్యక్రమంలో డీజీఎం(ప) అరవింద రావు, ఆర్కే 5, 6 గ్రూప్ గనుల ఏజెంట్ ఏవీ రెడ్డి, సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ మురళీమోహన్, స్పోర్ట్స్ సెక్రటరీ పాలకుర్తి రాజు,



సూపర్‌వైజర్ చాట్ల అశోక్, ఇన్‌చార్జి స్పోర్ట్స్ మేనేజర్ జాన్వెస్లీ, కోఆర్డినేటర్ తోట సురేష్ పాల్గొన్నారు.

పూనగూడలో వైద్యశిబిరం

నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని పూనగూడలో విస్తరణ వైద్యాధికారి రవిదాస్ శుక్రవారం వైద్యశిబిరం నిర్వహించారు. గ్రామంలో పరిశుభ్రతతో పాటు అంటు వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కుష్టు, క్షయ వ్యాధుల పట్ల అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలని, గ్రామంలో ఎవరికైన వ్యాధి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులు రావన్నారు. గ్రామంలోని మురికి కాలువల్లో క్రిమిఫోజ్ మందు పిచికారి చేశారు. ఎస్కే భగవన్, ఏఎన్ఎం పుష్పలత, ఆశావర్కర్ గంగుబాయి, ప్రజలు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-దహెగాం

ఓటర్లు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ కవిత అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలో స్వీప్ ఆధ్వర్యంలో ఐ ఓట్ ఫర్ షూర్ కార్యక్రమంలో భాగంగా ఓటరు అవగాహన ర్యాలీ నిర్వహించారు. దీనికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటు వజ్రాయుధం లాంటిదని దాన్ని ప్రతి ఒక్కరు వినియోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రాజేశ్వర్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శి ప్రణీత్‌బాబు, ఆర్ఐ నాందేవ్ పాల్గొన్నారు.

చెన్నూరు టికెట్‌పై భవిష్యత్తు ఆధారపడి ఉంది



నవతెలంగాణ-చెన్నూర్

చెన్నూరు కాంగ్రెస్ టికెట్ పై ఆయా నియోజకవర్గాల భవిష్యత్తు ఆధారపడి ఉందని ఆ పార్టీ కోటపల్లి మండల సీనియర్ నాయకుడు పోటు రాంరెడ్డి అన్నారు. చెన్నూరు టికెట్ కాంగ్రెస్‌కు కేటాయించకపోతే పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గంలోని పలు నియోజకవర్గ కేంద్రాలపైన ఒత్తిడి పెరిగే అవకాశం ఉందన్నారు. శుక్రవారం ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరు సమావేశంలో మాట్లాడారు. టికెట్‌పై స్పష్టత లేని కారణంగా ఇక్కడి నాయకులు వేరే నియోజకవర్గాలకు ప్రచారానికి వెళ్తున్నారన్నారు. దీని ప్రభావం నియోజకవర్గంపై పడే ప్రమాదం ఉందన్నారు. కరీంనగర్ రాహుల్ సభలో నిరసన తెలపగా ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్‌కి అప్పగించారన్నారు. ఆయన టికెట్టుపై సానుకూలంగా స్పందించారన్నారు. నియోజకవర్గ ప్రజల కోరిక మేరకు చెన్నూర్ కాంగ్రెస్ టికెట్‌ను కేటాయిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రె కోటపల్లి మండల అధ్యక్షుడు కాత్రాల మల్లయ్య, కొండం పేట మాజీ ఎంపీటీసీ ఆరే బాపు, పట్టణ సీనియర్ నాయకులు శ్రీధర్ బాబు, నాయకులు నీల గోవర్ధన్, ఎన్నం భాస్కర్, పాతర్ల నాగరాజు, లింగంపల్లి మహేష్, సుల్తాన్, అనిల్, అన్వర్ పాల్గొన్నారు

బాధిత కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-బెజ్జూర్

రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షుడు కొంద్ర జగ్గాగౌడ్ తల్లి బుచ్చమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కోనేరు కోనప్ప శుక్రవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. పెద్దకర్మలో పాల్గొని ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు డోకె వెంకన్న, భశరత్‌ఖాన్, జావీద్ అలీ, పుల్లూరి సతీష్ పాల్గొన్నారు.

వర్షం కోసం పూజలు

నవతెలంగాణ-కౌటాల

రైతులు ఆరుగాలం కష్టపడి పండించే పంటలకు నీరు అవసరం. గత నెల రోజులుగా వర్షాలు కురవకపోవడంతో వరి, సోయాబీన్, పత్తి పంటలు ఎండిపోతున్నాయి. వర్షాలు కురియాలని మండలంలోని కన్నెపెల్లి గ్రామంలో రైతులు, మహిళలు నీల్ల బిందెలతో గ్రామంలోని గ్రామదేవతలకు భజనలతో ఊరేగింపుగా వెళ్లి నీటితో అభిషేకం చేశారు. సర్పంచ్ మోర్లె రమేష్ మాట్లాడుతూ వరుణుడు కరుణిస్తేనే పంటలు చేతికొస్తాయని, వర్షం కురవకపోతే రైతు ఇన్నిరోజులు కష్టపడి చేసిన శ్రమంతా బూడిదలో పోసిన పన్నీరులా అయిపోతుందన్నారు. ప్రతి సంవత్సరం వర్షాలు కురవకపోతే మా ఊరిలోని గ్రామదేవతలకు రైతులు, మహిళలందరు కలిసి నీల్ల బిందెలతో వెళ్లి జలాభిషేకం నిర్వహిస్తే వర్షం కురుస్తుందనే నమ్మకంతో ఈ పూజలు చేయడం జరిగిందన్నారు.



మరోసారి కోనప్పను గెలిపించాలి



నవతెలంగాణ-కౌటాల

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో సిర్పూర్ నియోజకవర్గం నుండి బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీలో ఉన్న ఎమ్మెల్యే కోనేరు కోనప్పను మరోసారి గెలిపించాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఆదె వసంత్‌రావ్ కోరారు. శుక్రవారం మండలంలోని బోదంపెల్లి గ్రామంలో ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహించారు. కొనప్ప నియోజకవర్గంలో చేసిన అభివృద్ధిని వివరిస్తూ ఓట్లను అభ్యర్థించారు.

నేటి టోకెన్ సమ్మె విరమణ

నవతెలంగాణ-జైపూర్

సింగరేణి గని కార్మికులకు సంబంధించిన పండుగ అడ్వాన్సుతో పాటు 32 శాతం లాభాల వాట చెల్లింపు ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నెల 16న చెల్లిస్తామని చెప్పిన యాజమాన్యం ఎన్నికల కోడ్ అడ్డువస్తుందని యాజమాన్యం నగదు చెల్లింపులు నిలిపి వేసింది. ఈ క్రమంలో ఏఐయూటీసీ ఆధ్వర్యంలో 21న ఒక్క రోజు సమ్మెకు పిలుపు నిచ్చింది. దీంతో యాజమాన్యం నగదు చెల్లింపుల ప్రక్రియను ప్రారంభించినట్లు ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పండుగ అడ్వాన్సుతో పాటు లాభాల వాట 32 శాతం శుక్రవారం సాయంత్రం వరకు కార్మికులకు బ్యాంకు ఖాతాల్లో జమ చేసేందుకు యాజమాన్యం కసరత్తు ప్రారంభించిందని తెలిపారు. ఫలితంగా 21న నిర్వహించ తలపెట్టిన టోకెన్ సమ్మె విరమింజేస్తున్నట్టు పేర్కొన్నారు. కార్మికులు దీన్ని గుర్తించాలన్నారు.

హరీష్‌బాబుపై కోడ్ ఉల్లంఘన కేసు

నవతెలంగాణ-దహెగాం

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాల్వాయి హరీష్ బాబుపై ఎన్నికల కోడ్ ఉల్లంఘన కేసు నమోదైంది. ఎస్సై సనత్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం ఎన్నికల నియమావళికి వ్యతిరేకంగా కొత్మీర్ గ్రామంలో సమావేశం నిర్వహించారు. అనుమతి లేకుండా సమావేశం నిర్వహించినందుకు పాల్వాయి హరీష్‌బాబుపై కేసు నమోదుచేసినట్టు ఎస్సై సనత్‌కుమార్ తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా కొత్మీర్ గ్రామంలో సమావేశం నిర్వహించినట్టు ఫ్లయింగ్ స్క్వాడ్ టీం ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్టు పేర్కొన్నారు.

డీఎస్పీ అభ్యర్థిని గెలిపించండి

నవతెలంగాణ-రామకృష్ణాపూర్

చెన్నూరు నియోజకవర్గ డీఎస్పీ అభ్యర్థి నందిపాటి రాజును గెలిపించాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకులు రెహమాన్ కోరారు. శుక్రవారం నందిపాటి రాజును తన స్వగృహంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ,ఎస్సీ,ఎస్టీ మైనారిటీ ప్రజలు తమ ఓటు హక్కును సక్రమంగా వినియోగించుకొని నిరుపేద కుటుంబంలో పుట్టిన నందిపాటి రాజు టార్చ్‌లైట్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు.



భర్త మృతి పట్ల అనుమానం

నవతెలంగాణ-జన్నారం



తన భర్త మృతి పట్ల అనుమానం ఉన్నదని, విచారణ జరిపించాలని భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్సై సతీష్ తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని మొర్రిగూడ గ్రామపంచాయతీ పరిధిలోని గోండుగూడ గ్రామానికి చెందిన మాత్రం నగేష్(30)ను ఇందన్‌పెల్లి గ్రామానికి చెందిన వెంటేష బుధవారం పత్తిచెనులో నీరు పెట్టాడానికి తీసుకెళ్లాడు. అదే రోజు సాయంత్రం నగేష్‌ను వదిలి వెళ్లాడు. అదే రోజు ఆయన మరణించాడు. నగేష్ మృతిపై తమకు అనుమానం ఉందని భార్య గంగజల పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఎంపీడీఓ

నవతెలంగాణ-తాండూర్



నవంబర్ 30న జరగనున్న సాధారణ ఎన్నికలు నేపథ్యంలో తాండూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని పోలింగ్ కేంద్రాలను శుక్రవారం ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ పరిశీలించారు. జడ్పీ స్కూల్, ఎంపీ, యూపీఎస్, ఉర్దూ జడ్పీ పాఠశాలలో కేటాయించిన పోలింగ్ కేంద్రాల్లో వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. మంచి నీరు, టాయిలెట్, విద్యుత్ సౌకర్యాలను పరిశీలించి పంచాయతి కార్యదర్శికి సూచనలు చేశారు. మొబైల్ యాప్ తనిఖీలో భాగంగా గ్రామ పంచాయతీ నర్సరీ, అవెన్యూ కబ్రస్తాన్ కమ్యూనిటీ, మల్టీ లేయర్ అవెన్యూ ప్లాంటేషన్‌తో పాటు శానిటేషన్ పనులు పరిశీలించారు. ఆయన వెంట జడ్పీ పాఠశాల హెచ్ఎం, పంచాయతీ కార్యదర్శి తపాస్ కుమార్, గ్రామ పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

బూరుగుపల్లిలో ఎడ్ల పందాలు



నవతెలంగాణ-భీమారం

మండలంలోని బూరుగుపల్లి గ్రామంలో దసరా పండుగను పురస్కరించుకొని ఎడ్ల బండ్ల పోటీలను శుక్రవారం ప్రారంభించారు. దసరా పండుగకు ముందు రైతు నేస్తంగా భావించే అక్కడి రైతులు తమ ఎడ్ల బండ్లను అందంగా అలంకరించి ఈ పోటీల్లో పాల్గొటారు. ఈ సందర్భంగా చెన్నూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ భూక్య రాజ్‌కుమార్ నాయక్ మాట్లాడుతూ ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలతో ప్రారంభమైన ఎడ్ల పందెలను నిర్వహించి సంబరాలు జరుపుకోవడం ఆనందంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో భూక్య రమేష్ నాయక్, దసరు సమ్మయ్య నాయక్, బీఆర్ఎస్వీ అధ్యక్షులు భూక్య రాజేష్ నాయక్, మండల కో ఆప్షన్ సభ్యులు బాబర్ ఖాన్, నర్సింగాపూర్ సర్పంచ్ దుర్గం మల్లేష్, డైరెక్టర్ పానుగంటి లక్ష్మణ్, హై కోర్టు న్యాయవాది సుధాకర్, ఎల్‌హెచ్‌పీ నాయకులు శ్రీనివాస్ నాయక్, బీఆర్ఎస్ నాయకులు జల్లంపల్లి తిరుపతి, భూక్య శంకర్ నాయక్, భూక్య సాగర్, దారావత్ శంకర్ పాల్గొన్నారు.

వైద్య సేవలు అందించడంలో ప్రభుత్వం విఫలం



నవతెలంగాణ-జన్నారం

పేదలకు వైద్య సేవలు అందించడంలో ప్రభుత్వం విఫలమైందని బీఎస్పీ ఖానాపూర్ ఎమ్మెల్యే అభ్యర్థి బన్సీలాల్ రాథోడ్ ఆరోపించారు. శుక్రవారం మండలంలోని తపాలాపూర్ గ్రామంలో మన బిడ్డ-మన భరోసా కార్యక్రమంలో భాగంగా ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గ్రామంలో విష జ్వరాల బారిన పడిన బాదితులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఎస్పీ అధికారంలోకి వస్తే, నిరుపేదలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తామన్నారు. వచ్చే ఎన్నికల్లో ఆ పార్టీని గెలిపించాలని కోరారు. ఉచిత వైద్యం అందిస్తున్నామని చెబుతున్న బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోవడంలేదని మండిపడ్డారు. ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు తగిన గుణపాఠం చెప్పాలని కోరారు.

టికెట్ కాంగ్రెస్‌కే కేటాయించాలని వినతులు



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

చెన్నూరు నియోజకవర్గ టికెట్ కాంగ్రెస్‌కి కేటాయించాలని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసి వేణుగోపాల్‌ను ఆ పార్టీ నాయకులు డా రాజా రమేష్ కోరారు. శుక్రవారం కేసి వేణుగోపాల్, రాత్రి కరీంనగర్ పర్యటనలో భాగంగా వారిని కలిసి నియోజకవర్గంలో క్యాడర్‌తో పాటు నాయకత్వం గురించి వివరించారు. అనంతరం రాజా రమేష్ మాట్లాడుతూ నియోజకవర్గంలో పార్టీకు అభిమానులున్నారని, గెలుపు కోసం అహర్నిశలు శ్రమించే కార్యకర్తలు ఉన్నార తెలియజేస్తూ వినతిపత్రం అందించడం జరిగిందన్నారు. సీపీఐ పొత్తులో భాగంగా గెలుపు అవకాశాలు ఉన్న స్థానాన్ని త్యాగం చేయడం వల్ల స్థానిక ప్రజలకు, కార్యకర్తలకు అన్యాయం చేసినట్లు అవుతుందని ఆవేదన వ్యక్తంచేశారు. మిత్ర పార్టీ సైతం చెన్నూరులో పోటీ చేయడానికి ఆసక్తి కనబరచడం లేదని, వారి సహకారంతో కాంగ్రెస్ అభ్యర్థిని బరిలో నిలపాలని కోరారు. పార్టీ శ్రేణుల వినతులను స్వీకరించిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు సానుకూలంగా ప్రకటిస్తారని ఆశాభావం వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ రాంరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గోపతి రాజయ్య, జిల్లా అధికార ప్రతినిధి వోడ్నల శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి రిక్కుల శ్రీనివాస్ రెడ్డి, బీమారం, కోటపల్లి మండలాల అధ్యక్షులు వెంకన్న, మల్లన్న, సీనియర్ నాయకులు లాజర్, ఎల్లయ్య, నాయకులు పొన్నం హరీష్ పాల్గొన్నారు.

ఓపెన్‌కాస్ట్ బ్లాస్టింగ్‌లతో ప్రజల ఆందోళన



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

ఆర్కే ఓపెన్ కాస్ట్ బొగ్గు బ్లాస్టింగ్‌కు సమీప ప్రాంతంమైన ఆర్కే4 గడ్డలో నివసిస్తున్న ఇండ్లపై మట్టిపెళ్ళలు పడటంతో ప్రజలు ఆందోళన చేసారు. ప్రజలు, పట్టణ ఇన్‌చార్జి గాండ్ల సమ్మయ్య, వార్డ్ కౌన్సిలర్ రేవెల్లి ఓదేలుకు సమాచారం అందించారు. సింగరేణి ఓపెన్ కాస్ట్ అధికారులతో చర్చించి ప్రభావిత ప్రాంతాలను సందర్శించాలని కోరగా ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టు ఆఫీసర్ గోవిందరావు, మేనేజర్ వెంకటేశ్వర్లు కలిసి ఆర్కే4 గడ్డలో నివాసముంటున్న ఇండ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా సింగరేణి అధికారులు మాట్లాడుతూ ప్రభావిత ప్రాంతం ఉన్న వైపు బ్లాస్టింగ్ నిలిపివేస్తామని హామీ ఇచ్చారు. వీరు వెంట టీబీజీకేఎస్ ఫిట్ కార్యదర్శి పోశం, ఏఐటీయూసీ ఫిట్ కార్యదర్శి ఆంజనేయులు, స్థానిక ప్రజలు ఉన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో సదుపాయాలు కల్పిస్తాం

నవతెలంగాణ-జన్నారం

మండలంలో ఉన్న పోలింగ్ కేంద్రాల్లో అన్ని రకాల సదుపాయలు కల్పిస్తున్నామని తహసీల్దార్ వేణుగోపాల్ అన్నారు. శుక్రవారం తిమ్మాపూర్, రాంపూర్ గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. ఇక్కడ సౌకర్యాల కల్పనకు అధికారులకు సూచనలు చేశారు. మంచినీరు, విద్యుత్, ఫర్నిచర్, అన్ని రకాల సదుపాయాలను కల్పిస్తామన్నారు.

అర్హులైన లబ్దిదారులకు అందేలా చర్యలు

- కలెక్టర్ బదావత్ సంతోష్



బృందం సభ్యులతో జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్

నవతెలంగాణ-మంచిర్యాల

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల ఫలాలు అర్హులైన లబ్దిదారులకు అందేలా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో సెంట్రల్ సెక్రటేరియట్ సర్వీస్ నుండి అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్స్ ప్రొబేషనర్స్‌ల శిక్షణా కార్యక్రమం కోసం ఎఫ్‌టీపీలో భాగంగా జిల్లాకు వచ్చిన బృంద ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై అధ్యయనం చేసి పరిశీలించిన అంశాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బృందం ప్రతినిధులు జిల్లాలోని లక్షెట్టిపేట మండలంలోని గుల్లకోట, హాజీపూర్ మండలంలోని దొనబండ, తాండూర్ మండలంలోని మాదారం, బెల్లంపల్లి మండలంలోని పాత బెల్లంపల్లి, భీమిని మండలంలోని బిట్టూర్‌పల్లి గ్రామ పంచాయతీలలో కొనసాగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను పరిశీలించారన్నారు. జిల్లాలో సర్వశిక్షా అభియాన్ క్రింద రెండు, మూడు గ్రామాలకు ఒక ఉప కేంద్రం పని చేస్తుందన్నారు. సెగ్రిగేషన్ షెడ్లలో ఉపయోగకర వ్యర్థాల ద్వారా సేంద్రియ ఎరువు తయారు చేసి విక్రయించి ఆదాయం సమకూర్చడం జరుగుతుందని తెలిపారు. ఈ ప్రక్రియపై ఒక డాక్యుమెంటేషన్ రూపొందించి ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. మన ఊరు - మన బడి కార్యక్రమంలో మొదటి విడతలో 248 పాఠశాలలను ఎంపిక చేసి 12 రకాల విభాగాలలో అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. గ్రీన్ చాక్ బోర్డ్, మూత్రశాలలు, వంట శాలలు, భోజనశాలలు, ప్రహరీగోడ తదితర అభివృద్ధి పనలను చేపట్టడం జరిగిందని తెలిపారు. ప్రతి గ్రామంలో వైకుంఠధామం, డంపింగ్ యార్డు, నర్సరీ, క్రీడా ప్రాంగణం, పల్లెప్రకృతి వనం, బృహత్ పల్లెప్రకృతి వనం ఏర్పాటు చేశామన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో జిల్లాలో ఆయా గ్రామాల్లో చేపడుతున్న పనుల ఆధారంగా కూలీలకు ఉపాధి కల్పిస్తున్నామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలను అర్హులైన లబ్దిదారులకు అందేలా సంబంధిత శాఖల సమన్వయంతో కార్యచరణ అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. బృందం ప్రతినిధులు మాట్లాడుతూ తమ అధ్యయనంలో భాగంగా జిల్లాలోని ఎంపిక చేసిన గ్రామాల్లో పరిశీలనకు సదుపాయాలు కల్పించినందుకు ధన్యవాదములు తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు మెమోంటో అందజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ నరేందర్, డీపీఓ వెంకటేశ్వరావు, డీఏఓ కల్పన పాల్గొన్నారు.

మొక్కుబడిగా వచ్చిపోతున్న సింగరేణి వైద్యులు

- ఆంబులెన్స్‌ను తిరిగి పంపించిన గ్రామస్తులు

నవతెలంగాణ-జైపూర్

శ్రీరాంపూర్, ఇందారం ఓపన్‌కాస్ట్ గని ప్రభావిత గ్రామమైన రామరావుపేట్‌కు సింగరేణి వైద్యులు మొక్కుబడిగా వచ్చిపోతున్నారని స్థానిక సర్పంచ్ నామాల సత్యవతి తిరుపతి ఆరోపించారు. గ్రామ పంచాయతీ ప్రజలకు కనీస సమాచారం ఇవ్వకుండా వచ్చిపోవడం ఏమిటని ప్రశ్నిస్తున్న గ్రామస్తులు సర్పంచ్ ఆధ్వర్యంలో శుక్రవారం గ్రామానికి వచ్చిన వైద్యులను వెనక్కి పంపించారు. ఈ సంధర్భంగా సర్పంచ్ నామాల సత్యవతి తిరుపతి మాట్లాడుతూ ఒక వైపు ఇందారం ఓసీ, మరో వైపు శ్రీరాంపూర్ ఓసీ మధ్యలో గల రామారావుపేట్ గ్రామ పంచాయతీ ప్రజలు శబ్ద, వాయు కాలుష్యంతో తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొవడంతో పాటు అనారోగ్యానికి గురవుతున్నారని అన్నారు. శ్రీరాంపూర్ ఓపన్‌కాస్ట్ గని ఓవర్ బర్డెన్ తొలింపులో భాగంగా గ్రామ శివారుల్లో డంపు చేస్తుండటంతో విపరీతమైన దుమ్ము గ్రామంలో వచ్చి చేరుతుందన్నారు. ఫలితంగా గ్రామస్థులు శ్వాసకోష సంబంధిత వ్యాధులతో ఆస్పత్రుల పాలవుతున్నారని అన్నారు. ఈ విషయంలో సింగరేణి ఉన్నతాధికారులతో పాటు జిల్లా కలెక్టర్‌కు వినతులు అందించిన ఫలితం లేకుండాపోయిందన్నారు. గ్రామస్తులకు సింగరేణి ద్వార వైద్య సేవలు అందిస్తున్నట్లు చూపించడం కోసం అప్పుడప్పుడు ఆంబులెన్స్‌తో వచ్చి జీపీ కార్యాలయం ఎదుట అందుబాటులో ఉన్నవారికి నామ మాత్రపు వైద్య సేవలు అందించి ఫోటోలు దిగి వెళ్లిపోవడం జరుగుతుందని తెలిపారు. వైద్య శిభిరం ఏర్పాటు చేస్తున్నట్లు ముందుగా సమాచారం అందిస్తే అందుబాటులో ఉండే వీలుంటుందన్నారు. కానీ ఎవ్వరికి సమాచారం ఇవ్వకుండా ఆంబులెన్స్ వచ్చే వరకు తెలియకుండా వచ్చిపోతూ సేవలు అందిస్తున్నట్లు రికార్డులు తయారు చేసుకుంటున్నారని ఆరోపించారు. మొక్కుబడిగా వచ్చిపోవడం సరికాదని హెచ్చరిస్తూ గ్రామానికి వచ్చిన ఆంబులెన్స్‌ను తిరిగి వెనక్కి పంపించామన్నారు.



అంబులెన్స్ తిరిగి పంపిస్తున్న గ్రామస్తులు

పార్టీ గెలుపుకు కార్యకర్తలు కృషి చేయాలి



మాట్లాడుతున్న కాంగ్రెస్ బెల్లంపల్లి అభ్యర్థి గడ్డం వినోద్

నవతెలంగాణ-తాండూర్

ప్రతి కార్యకర్త సైనికుడిలా పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని బెల్లంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి, మాజీ మంత్రి గడ్డం వినోద్ అన్నారు. అభ్యర్థిగా ప్రకటించిన తర్వాత తొలిసారిగా వచ్చిన ఆయనకు శ్రేణులు బైక్ ర్యాలీ నిర్వహించి ఘనంగా స్వాగతం పలికారు. టోల్‌గేట్ నుండి ప్రారంభమైన ర్యాలీ కన్నాల జాతీయ రహదారి గుండా హనుమాన్ విగ్రహం, బజార్ మీదుగా సాగింది. అనంతరం పద్మశాలి భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో నాయకులకు, కార్యకర్తలకు గెలుపే లక్ష్యంగా అందరూ కలిసికట్టుగా పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా గడ్డం వినోద్ మాట్లాడుతూ తన మీద నమ్మకంతో ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించిన సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. తొమ్మిదేళ్ల బీఆర్ఎస్ కుటుంబ పాలనతో ప్రజలు విసిగిపోయారన్నారు. పేదలకు సంక్షేమ పథకాలు అందించే కాంగ్రెస్ వైపు ప్రజలందరూ చూస్తున్నారని తెలిపారు. రాష్ట్రం, నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండా ఎగరవేయడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. నియోజకవర్గంలోని ప్రతి ఒక్క కాంగ్రెస్ కార్యకర్త సైనికుడిలా పార్టీ గెలుపు కోసం కృషి చేయాలన్నారు. కార్యకర్తలు పార్టీ ప్రకటించిన ఆరు గ్యారెంటీలను గడప గడపకు తీసుకెళ్లాలన్నారు. తాను గెలిచాక బెల్లంపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. సందర్భంగా పలువురు ఆయన సమక్షంలో ఇతర పార్టీల నుంచి కార్యకర్తలు, నాయకులు చేరగా వారికి కండువలు వేసి ఆహ్వానించారు.

గొడవలు సృష్టించడానికి ఎమ్మెల్యే గూండాలను తెప్పించారు

- మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్ సాగర్ రావు ఆరోపణ

నవతెలంగాణ-హాజీపూర్

మంచిర్యాలలో ఎన్నికల సందర్భంగా గందరగోళం, ఘర్షణలు సృష్టించడానికి ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు, ఆయన తనయుడు నడిపెల్లి విజిత్ రావు రాయలసీమ, ఆంధ్ర ప్రాంతం నుంచి గూండాలను తెప్పించారని కాంగ్రెస్ అభ్యర్థి కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు ఆరోపణలు చేశారు. శుక్రవారం ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో ఓటమి తప్పదని గమనించిన ఎమ్మెల్యే గుంటూరు, కర్నూల్ నుంచి గుండాలను తీసుకువచ్చాడని తెలిపారు. ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసులో వారికి ఆశ్రయం ఇచ్చాడని, గొడవలు, అలజడలు సృష్టించి ప్రజలను భయపెట్టేందుకు భారీ కుట్ర పన్నారని ఆరోపించారు. రెండు రోజుల క్రితం వారి ఆచూకీ బయటపడడంతో పక్కన ఉన్న లాడ్జికి మకాం మార్చారని పేర్కొన్నారు. అక్కడ నలుపు రంగు కారులో వారిని మరోచోటుకు తరలించారని అభియోగించారు. తనపై కూడా బౌతికదాడులు చేయాలని ప్రయత్నం చేస్తున్నారని సందేహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే హయాంలో గంజాయి విచ్చలవిడిగా అమ్మకాలు జరిగాయన్నారు. మున్సిపల్ కార్యాలయం ఎదుట పట్టపగలే మహిళ హత్య, రైల్వే స్టేషన్ వద్ద మహిళ హత్యతో పాటు రియల్ ఎస్టేట్ గొడవలో ఆయన బంధువు హత్యకు గురయ్యారని తెలిపారు. ఆయన హాయాంలో శాంతి భద్రతలు ఎక్కడ ఉన్నాయని ప్రశ్నించారు. ప్రజలు ఎమ్మెల్యే దివాకర్ ఆయన తనయుని ఆగడాలు, గుండాయిజం గురించి నిజాలు తెలుసుకోవాలని కోరారు. తాను గెలిస్తే అభివృద్ధితో పాటు శాంతిభద్రతలు కాపాడుతానని హామీ ఇచ్చారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకుడు ప్రేమ్‌సాగర్‌రావ్

సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-జన్నారం

సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ శాస్త్రి నారాయణరావు అన్నారు. శుక్రవారం మండలంలోని ధర్మారంలో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఫీవర్ సర్వేతో పాటు డ్రై డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డెంగ్యూ, మలేరియా వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

దేవాలయాల నిర్మాణాలను అడ్డుకుంటున్నారు : మతాల పెద్దలు



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

పట్టణంలో మసీదు, చర్చిలు, దేవాలయాల నిర్మాణాలను సింగరేణి, రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకుంటుందని ఆయా మతాల పెద్దలు ఆరోపించారు. శుక్రవారం పట్టణంలోని అన్ని కులాల మత పెద్దలు స్థానిక మదీనా మజీద్‌లో సమావేశమై మాట్లాడారు. 40 సంవత్సరాల క్రితం సింగరేణి సంస్థ ఇచ్చినటువంటి అనుమతి ఉన్న ప్రార్థన స్థలాలను నిర్మించుకోవడానికి తీవ్ర ఇబ్బంది పెడుతున్నారన్నారు. క్యాతనపల్లి మున్సిపాలిటీలో నివసిస్తున్నటువంటి 4 వేల మంది కుటుంబాలకు పట్టాలు ఇచ్చిన ప్రభుత్వం అన్ని మతాల స్థలాలకు దేవాలయాలు, చర్చిలు, మస్జీద్‌లకు మత సామరస్యాన్ని దెబ్బతీసే విధంగా పట్టాలు ఇవ్వకపోవడం శోచనీయమన్నారు. చెన్నూర్ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బాల్క సుమన్ దృష్టికి తీసుకెళ్లిన స్పందించ లేదని ఆరోపించారు. అన్ని కుల సంఘాలకు భవనాలు నిర్మించి, వారికి ఉన్న సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చి ఐదు సంవత్సరాల కాలంలో ఏలాంటి పనులు చేయలేదన్నారు. దసరా పండుగ తర్వాత అనుమతి ఇవ్వకపోయిన నిర్మాణాలు చేపట్టడానికి వెనుకడుగు వేయమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ ముస్లీం మైనార్టీ వెల్ఫేర్ కమిటీ అధ్యక్షులు అబ్దుల్ అజీజ్, యాకుబ్ అలీ, అక్బర్ అలీ, డాక్టర్. సలీం, ఖాజా షరీఫ్, ఖాజా, పాషా, తహర్, వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ సభ్యులు నాగరాజు, భీమయ్య శ్రీను, గోపాల్, రమేష్, చర్చి పాస్టర్లు సాల్మన్ రాజు, . సాల్మన్ పాల్గొన్నారు.

'ఇండ్ల స్థలాల భూమిని కాపాడండి'



నవతెలంగాణ-తాండూర్

మా ఇండ్ల స్థలాల భూమిని కాపాడాలని ఎస్సీ ఉపకులానికి చెందిన మాదిగలు కోరారు. శుక్రవారం తహసీల్దార్ రోహిత్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాదిగ కులానికి చెందిన తమకు పూర్వీకులు పట్వారి వ్యవస్థ కాలంలో ప్రభుత్వ పనులకు సేవలు అందించినందుకు గాను తాండూర్ శివారులోని 630/1 సర్వే నంబర్‌లో 34 గుంటల భూమిని ఇచ్చారన్నారు. ప్రస్తుతం భూమి విలువ పెరగడంతో కొందరు భూ అక్రమార్కులు మాకు బహుమానంగా ఇచ్చిన భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. అప్పటి సర్పంచ్ సల్వాజి ఉమారాణి కాలంలో కేటాయించిన భూమి పత్రాలు తమ దగ్గర ఉన్నాయని తెలిపారు. మా భూమి హద్దులను గుర్తించి న్యాయం చేయాలని కోరారు. ఈ విషయమై తహసీల్దార్‌ను వివరణ కోరగా సర్వేయర్ ద్వారా కొలతలు నిర్వహించి హద్దులు చూపిస్తామన్నారు.

ప్రభుత్వ వాహనంపై ముఖ్యమంత్రి బొమ్మ



నవతెలంగాణ-భీమిని

ప్రభుత్వ ఆస్పత్రికి కేటాయించిన 108 వాహనంపై ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రాన్ని తొలగించకపోవడం ఎన్నికల కోడ్ ఉల్లంఘన కిందికి వస్తుంది. వైద్య సిబ్బంది ఇంకా ఆలోచించకుండా ముఖ్యమంత్రి ఫోటో దర్జాగా వాహనంపై ఉంచి సేవలందిస్తున్నారు. దీనిపై ఎన్నికల అధికారులు స్పందించకపోవడం అనుమానాలకు తావిస్తోంది. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి ప్రభుత్వ వాహనాలపై ప్రభుత్వ గోడలపై ఉన్న గుర్తులు, ఫోటోలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

కాంగ్రెస్‌లో చేరిన గుడిపేట్ వార్డు సభ్యులు

నవతెలంగాణ-హాజీపూర్

కాంగ్రెస్‌లో గుడిపేట్ వార్డు 9,10 వార్డ్ సభ్యులు ఆమధ లక్ష్మీ, ఇస్లావత్ జ్యోతిలు చేరారు. శుక్రవారం దొమ్మటి సత్తయ్య ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్సీ కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి ఆయన కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్ఎస్ ప్రజా వ్యతిరేక విధానాలతో విసుగుచెంది పార్టీలోకి వలసలు వస్తున్నాయని ఈ సందర్భంగా ప్రేమ్‌సాగర్ రావ్ అన్నారు.

ప్రపంచ శాంతి కోసమే ఉపవాస దీక్షలు

నవతెలంగాణ-కాసిపేట

ప్రపంచ శాంతి కోసమే ఉపవాస దీక్షలు చేపడుతున్నట్లు కల్వరీ మినిస్ట్రీస్ పాస్టర్ ప్రవీణ్ పేర్కొన్నారు. గురువారం రాత్రి మంచిర్యాల జిల్లా సోమగూడెం, బెల్లంపల్లి రహదారి మధ్యలోని కల్వరీ మినిస్ట్రీస్ పాస్టర్ ప్రవీణ్ చేపట్టిన 50 రోజుల ఉపవాస దీక్షలు ముగింపు సభ అట్టహాసంగా నిర్వహించారు. వివిధ జిల్లాలు, రాష్ట్రాలు, దేశ నలమూలల నుంచి లక్షలాదిగా క్రైస్తవులు భారీగా తరలివచ్చారు. ముగింపు సభకు బెల్లంపల్లి, మంచిర్యాల ఎమ్మెల్యేలు దుర్గం చిన్నయ్య, దివాకర్ రావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఉపవాస దీక్ష ముగించి పాస్టర్ ప్రవీణ్ లక్షలాదిగా వచ్చిన క్రైస్తవులను ఆశీర్వదించారు. అందరూ కలిసి మెలిసి ఉండి శాంతి కోరుకోవాలని సూచించారు. ఎటువంటి సమస్యలు తలెత్తకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సిస్టర్ షారూన్, ఎమ్మెల్యే సతీమణి తారా, మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, సర్పంచ్ ప్రమీలా గౌడ్, నిర్వాహకులు శ్రీనివాస్, ముత్తినేని రవికుమార్ క్రైస్తవులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేపట్టడం జరుగుతుందని, అందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. శుక్రవారం స్థానిక శాంతినగర్‌లోని ఈవీఎం గోదాంను కలెక్టర్, ఐటీడీఏ పీఓ చాహత్ బాజ్‌పాయ్‌తో కలిసి సందర్శించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు, రిటర్నింగ్ అధికారులు, సంబంధిత ఎన్నికల విభాగం సిబ్బంది సమక్షంలో ఆన్‌లైన్ విధానం ద్వారా బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్, వీవీ ప్యాట్స్‌ల కేటాయింపు ఫస్ట్ లెవెల్ ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించారు. అనంతరం సాధారణ ఎన్నికలలో వినియోగించాల్సి ఉన్న ఈవీఎం, వీవీ ప్యాట్ల వివరాల గురించి సంబంధిత అధికారులకు కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. ఈవీఎంలు, బ్యాలెట్ల సామాగ్రి విషయంలో అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ ర్యాండమైజేషన్‌లో అదనపు కలెక్టర్లు ఖుష్బు గుప్తా, శ్యామలాదేవి, శిక్షణ సహాయ కలెక్టర్ వికాస్ మోహతో, ఆర్డీఓ స్రవంతి, ఎన్నికల విభాగం పర్యవేక్షకురాలు నలంద ప్రియా, వివిధ గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

మహేశ్వర్‌రెడ్డి గెలుపుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

నవతెలంగాణ-దిలావర్‌పూర్

నర్సాపూర్(జి) మండల కేంద్రంలోని పద్మశాలి సంఘంలో శుక్రవారం బీజేపీ మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి మెడిసెమ్మె రాజు మాట్లాడుతూ నిర్మల్ నియోజక వర్గంలో వచ్చే నియోజకవర్గ ఎన్నికల్లో మహేష్‌రెడ్డి గెలుపు ఖాయమని అన్నారు. అందుకు నాయకులు, కార్యకర్తలు మండలంలోని ప్రతి పోలింగ్ బూత్ నుంచి బీజేపీకి అత్యధిక మెజారిటీ ఓట్లు వచ్చేలా కృషి చేయాలని కోరారు. బీజేపీ అభ్యర్థి ఏలేటి మహేశ్వర్‌రెడ్డి గెలుపు వ్యూహానికి సంభందించి కార్యకర్తలకు దిశ నిర్దేశం చేశారు. ప్రస్తుత బీఆర్ఎస్ మంత్రి అవినీతి, భూకబ్జాలతో పాటు, కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు అర్జున్ ఠాకుర్, జిల్లా అధికార ప్రతినిధి బర్కుంట నరేందర్, జిల్లా కార్యదర్శి మిట్టపల్లి రాజేందర్, మాజీ ఎంపీటీసీ విజయ్, బూత్ అధ్యక్షులు గంగారాం, రవీందర్, సాయి కృష్ణ, అశోక్, శ్రీనివాస్, రాజు, వినాయక్, నాయకులు శివాజీ పటేల్, దత్తురాం, కోడ్ సుధాకర్, డాక్టర్ సాయన్న, గంగాధర్, రాజు, మహిపాల్ పాల్గొన్నారు.

'మళ్లీ మనిషిలోకి' పుస్తకావిష్కరణ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌అర్బన్

ఆదిలాబాద్ జిల్లాకు చెందిన ప్రముఖక కవి, రచయిత డాక్టర్ ఉదారి నారాయణ రచించిన ఐదవ కవితా సంపుటి 'మళ్లీ మనిషిలోకి'ని ప్రసిద్ధకవి, సరస్వతీ, కబీర్ సమ్మాన్ అవార్డులు, కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత కె.శివారెడ్డి హైదరాబాద్‌లో శుక్రవారం సాయంత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదిలాబాద్ జన జీవితంతో పాటు జాతీయ, అంతర్జాతీయ సమస్యలకు స్పందించి ఉదారి నారాయణ కవితలు రాశాడన్నాడు. ఈయన కవిత్వం ప్రత్యేక భాషా, శైలీ శిల్పాలతో కూడుకున్నదని ఈ పుస్తకం చదివితే తెలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కవి నాళేశ్వరం శంకరం, ప్రముఖ పరిశోధకుడు సంగిశెట్టి శ్రీనివాస్, ప్రముఖ రచయిత, జర్నలిస్ట్ గుడిపాటి, ప్రముఖ కవులు కందుకూరి శ్రీరాములు, బెల్లంకొండ సంపత్ కుమార్, దిద్దిరాజు ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

రూ.1.52లక్షలు పట్టివేత

నవతెలంగాణ-తాండూర్

సార్వత్రిక ఎన్నికలలో పర్యవేక్షణలో భాగంగా తాళ్లగురజాల పోలీస్ స్టేషన్ పరిధిలోని లంబాడీతాండ సమీపంలో వాహనాల తనిఖీని పోలీసులు నిర్వహించారు. ఈక్రమంలో సరైన ఆధారాలు లేకుండా తీసుకెళ్తున్న రూ. లక్ష 52 వేలను పోలీసులు సీజ్ చేశారు. మేడి ఎర్రయ్య వద్ద రూ. 52 వేలు, భీమిని మండలానికి చెందిన కకిరి దర్శన్ వద్ద రూ. లక్ష మొత్తం రూ, లక్ష 52 వేల నగదును సీజ్ చేసి ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్‌కు అప్పగించామని ఎస్సై తెలిపారు. సరైన ఆధారాలు లేకుండా ఎక్కువ మొత్తంలో నగదు తీసుకెళ్తే సీజ్ చేస్తామన్నారు.

సిర్పూర్(టి) : అసెంబ్లీ ఎన్నికల తనిఖీలో భాగంగా వాహనాలను తనిఖీ చేస్తుండగా రూ.1.50 లక్షల నగదును పట్టుకున్నట్టు కౌటాల సీఐ సాదిక్‌పాషా, ఎస్సై దీకొండ రమేష్ తెలిపారు. శుక్రవారం అంతర్రాష్ట్ర సరిహద్దులో వెంకట్రావ్‌పేట్ గ్రామం వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రానికి చెందిన సంజయ్ ఘరాని కాగజ్‌నగర్‌కు రూ.1.50 లక్షలు తీసుకెళ్తుండగా వాటికి సంబంధించిన సరైన ఆధారాలు చూపించకపోవడంతో సీజ్ చేసి ఎన్నికల ఫ్లయింగ్‌స్క్వాడ్ సిబ్బందికి అప్పగించినట్టు ఆయన తెలిపారు.

గంజాయి పట్టివేత



నవతెలంగాణ-తాండూర్

బెల్లంపల్లి పట్టణంలోని అంబేద్కర్‌నగర్ ప్రాంతంలోని శ్మశానవాటిక సమీపంలో గడ్డం బెండేటి రాజు, బూడిదగడ్డ బస్తీ బూర్ల సాయి, అనే ఇద్దరు వ్యక్తులను పట్టుకొని విచారించగా వారి వద్ద 130 గ్రాముల గంజాయి లభించినట్టు వన్‌టౌన్ ఎస్సై బన్సీలాల్ తెలిపారు. నింధితులు గత కొంత కాలంగా బాలార్ష నుంచి తక్కువ ధరకు గంజాయి కొనుక్కొని తీసుకువచ్చి, బెల్లంపల్లిలోని యువకులకు ఎక్కువ రేటుకు విక్రయించడమే గాక, తాము కూడా గంజాయి తాగుతున్నట్లు విచారణలోవెల్లడైందని తెలిపారు కేసు నమోదుచేసినట్టు తెలిపారు. గంజాయి సరఫరా చేసిన, తాగిన వారిపై కేసు నమోదు చేయడమేగాక వారిపై పీడీ యాక్ట్ కూడా నమోదు చేస్తామని తెలిపారు.

ఎం-21 వాలీబాల్ టోర్నీ విజేత నాయకపు గూడెం



నవతెలంగాణ-కాసిపేట

కాసిపేట మండలం ఉమ్మడి సోనాపూర్ పంచాయతీలోని గిరిజన గ్రామాల యువకులకు మూమెంట్-21 బహుజన ఉద్యమ సంస్థ నిర్వహించిన వాలీబాల్ టోర్నీ విజేతగా సోనాపూర్ పంచాయతీలోని నాయకపు గూడెం జట్టు నిలిచింది. గట్రావు పల్లె, సన్నాపూర్ పంచాయతీ పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన 10 జట్లు పోటీలలో పాల్గొన్నాయి. గట్రావు పల్లె, సోనాపూర్ నాయకపు గూడెం జట్లు ఫైనల్‌కు చేరుకున్నాయి. ఫైనల్లో సోనాపూర్ నాయకపు గూడ జట్టు ఘట్రావు పల్లె జట్టుపై రెండు వరుస సెట్లలో గెలుపొంది విజేతగా నిలిచింది. శుక్రవారం రాత్రి విజేతలకు ఎం-21 మండల ఇన్‌చార్జి పల్లె మల్లయ్య, జిల్లా కమిటీ సభ్యుడు కొమ్ముల బాపు, సభ్యుడు బద్ది శ్రీనివాస్, స్థానిక గిరిజన నాయకుడు మాన్కు, షీల్డ్‌తో పాటు నగదు ప్రోత్సహకాన్ని అందజేశారు.

పోలీసుల తనిఖీ.. నగదు పట్టివేత

నవతెలంగాణ-తాండూర్

బెల్లంపల్లి వన్‌టౌన్ సీఐ బన్సీలాల్, ఎస్సైలు ప్రవీణ్, విక్టర్, తమ సిబ్బందితో కలిసి పాత బస్ స్టాండ్ సమీపంలో వాహనాలను తనిఖీ చేపట్టగా ఎలాంటి సరైన ఆధారాలు లేకుండా ఎక్కువ మొత్తంలో నగదు కలిగిఉన్న సొగల యాదగిరి, బూడిదగడ్డ బస్తీ, బెల్లంపల్లి వద్దనుంచి, రూ.లక్షా నగదును పట్టుకొని సీజ్ చేశారు. తదుపరి చర్యల నిమిత్తం ఎఫ్ఎస్‌టీ టీమ్‌కు అప్పగించారు. ఎవరైనా వ్యక్తులు సరైన ఆధారాలు లేకుండా ఎక్కువ మొత్తంలో నగదు కలిగివున్న లేదా రవాణా చేసిన అట్టి నగదు పట్టుకొని సీజ్ చేయడం జరుగుతుందని తెలిపారు.

కాంగ్రెస్ నాయకులు క్షమాపణలు చెప్పాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌అర్బన్

కాంగ్రెస్ నాయకులు మహిళలకు క్షమాపణలు చెప్పాలని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షురాలు స్వరూప రాణి డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఎలక్ట్రానిక్ మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. మహిళల ఆత్మ గౌరవాన్ని దెబ్బ తీసేలా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడారని ఆరోపించారు. ఇటీవల టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి కూడా తెలంగాణ ఉద్యమాన్ని కించపరిచేలా వ్యాఖ్యానించారని మండిపడ్డారు. తాజాగా బతుకమ్మ చీరల పంపిణీపై స్థానిక కాంగ్రెస్ నాయకుడు కంది శ్రీనివాస్‌రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేశారని అన్నారు. కాంగ్రెస్ నాయకులకు కోట్ల ఆస్తులు ఉన్నాయని వారి భార్యలు ఖరీదైన చీరలే ధరిస్తారని కానీ సామాన్య మహిళలకు బతుకమ్మ చీరలను పంపిణీ చేస్తే మాత్రం కడుపు మంటగా ఉందని ఎద్దేవా చేశారు. బతుకమ్మ చీరలను అవహేళన చేస్తూ మాట్లాడిన కాంగ్రెస్ నాయకుడు కంది శ్రీనివాస్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీకి మహిళా సంఘాలకు బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఇటువంటి ఘటనలు పునరావృతం అయితే తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించారు. మహిళా సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని అన్నారు. మహిళల అభ్యున్నతికి అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిన ఘనత బీఆర్ఎస్ పార్టీకే దక్కుతుందని గుర్తు చేశారు. మేనిఫెస్టోలో సైతం మహిళలకు ప్రాధాన్యత కల్పించారని, సౌభాగ్య లక్ష్మి పథకం కింద అర్హులైన మహిళలకు మూడు వేల రూపాయల భృతి, నాలుగు వందలకే గ్యాస్ సిలిండర్, జీవిత బీమా, వంటి హామీలను మేనిఫెస్టోలో పొందుపరిచినట్లు తెలిపారు. మహిళల సంపూర్ణ మద్దతు బీఆర్ఎస్‌కే ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ మహిళా పట్టణ కార్యదర్శి బొడగం మమత, మహిళ నాయకురాలు పర్వీన్ ఫెరోస్, పర్వీన్ సుల్తానా, ఉమా మహేశ్వరి, గంగామణి, కరుణ పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలి



నవతెలంగాణ-కడెం

కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త సైనికుల్లా పనిచేయాలనీ కర్నాటక ఎమ్మెల్సీ కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జీ ప్రకాష్ రాథోడ్ కార్యకర్తలకు సూచించారు. శుక్రవారం కడెం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఖానాపూర్ నియోజకవర్గంతో పాటు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేయడమే లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. కాంగ్రెస్ పార్టీ 6గ్యారంటీలను గ్రామాల్లో వివరిస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్సీని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జు పటేల్, పార్టీ మహిళ విభాగం జిల్లా అధ్యక్షురాలు దుర్గాభవాని, మండల అధ్యక్షుడు తుమ్మల మల్లేష్ యాదవ్, యూత్ కాంగ్రెస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సతీష్‌రెడ్డి, నాయకులు వజీథ్ ఖాన్, రాంకిషన్, తారి శంకర్, రమేష్, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జాతి గెలుపే ప్రథమ లక్ష్యం

- మందకృష్ణ మాదిగ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌అర్బన్

మాదిగ జాతి గెలుపే తన ప్రథమ లక్ష్యమని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఖానాపూర్ బస్తీలో ఏర్పాటు చేసిన మాదిగ విశ్వరూప సన్నాహక మహాసభ సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా జిల్లా కేంద్రంలోని దస్నాపూర్, బొక్కలగూడ, మున్సిపల్ కాలనీలలో పర్యటించారు. స్త్రీలు మంగళ హారతులతో ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఆరెల్లి మల్లేష్ అధ్యక్షతన ఈ సభను నిర్వహించారు.ఈ సందర్భంగా మందకృష్ణ మాట్లాడుతూ

ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణను అన్ని పార్టీలు సమర్థిస్తున్నప్పటికీ వర్గీకరణ చేయడంలో మాత్రం విఫలమయ్యాయని ఆరోపించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మద్దతు ప్రకటించిన పార్టీలు అధికారంలోకి వచ్చాక మాత్రం మౌనం వహిస్తున్నాయని ధ్వజమెత్తారు. ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తున్నామని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాల గుండా ఆదిలాబాద్ టు హైదరాబాద్ రథయాత్రను ప్రారంభించడం జరిగిందన్నారు. జాతీయ పార్టీల నుంచి ప్రాంతీయ పార్టీల దాకా ఎవరు గెలిచినా ఓడిన మాదిగలకు ఒరిగిందేమీ లేదని విమర్శించారు. తమ జాతి భవిష్యత్తుకు శాశ్వత పరిష్కారమైన వర్గీకరణ మాత్రమే మాదిగల జీవితాల్లో వెలుగులు నింపుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. నవంబర్ నెల రెండో వారంలో హైదరాబాద్‌లో నిర్వహించే మాదిగల విశ్వరూప మహాసభను మాదిగలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. తన జాతి బిడ్డలను మేల్కొల్పడం కోసమే యాత్రను ప్రారంభించానని, రాజకీయ పార్టీలది ఓట్ల వేట అని తనది తన జాతి గెలుపు వేట అని పేర్కొన్నారు. మాదిగలు దేశాన్ని శాసించే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ సమయంలో కేసీఆర్ వెంటే ఉన్న తనకు మూడు నెలల వ్యవధిలోపే అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకు వెళ్తానని కేసీఆర్ మాట ఇచ్చి మోసగించారని గుర్తు చేశారు. కేసీఆర్ క్యాబినెట్‌లో ఒక్క మాదిగ ఎమ్మెల్యే అభ్యర్థికి మంత్రి పదవి దక్కకపోవడం కేసీఆర్ చిత్తశుద్ధికి నిదర్శనమని ఎద్దేవా చేశారు. వర్గీకరణ విషయంలో మద్దతిచ్చే పార్టీలను మాత్రమే ఆదరించాలని క్షేత్రస్థాయిలో ఆయా పార్టీల వైఖరి ఏంటో ప్రశ్నించాలని శ్రేణులకు పిలుపునిచ్చారు. బీజేపీ అగ్ర నాయకులు తమకు నచ్చిన విధంగా చట్టాలను తీసుకువస్తున్నారని వర్గీకరణ విషయంలో మాత్రం మీనమేషాలను లెక్కిస్తున్నారని మండిపడ్డారు. వర్గీకరణ సాధించేంతవరకు తన పోరాటం ఆగబోదని స్పష్టం చేసిన ఆయన రాబోయే రోజుల్లో ఉద్యమ స్ఫూర్తిని చాటాలని పిలుపునిచ్చారు. అనంతరం జెండా ఊపి రథయాత్రను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శులు పాలెపు గణేష్, జిల్లపల్లి నవీన్, శ్రీను, సూర్యకాంత్, ప్రేమేందర్, దేవిదాస్, ఆదిలాబాద్ టౌన్ కమిటీ బాధ్యులు కామ్‌పెల్లి సుదర్శన్, చిర్ర జాన్సన్, సురేష్ మోహన్, గణేష్, దయాకర్, నవీన్, దినకర్, ప్రసన్న, మంతెన రఘు పాల్గొన్నారు.

పాలస్తీనాపై ఇజ్రాయెల్ అమానుష దాడిని ఆపాలి



నవతెలంగాణ-నిర్మల్

పాలస్తీనాపై ఇజ్రాయెల్ అమానుష దాడిని ఆపాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ప్రజాపంథా జిల్లా ప్రధాన కార్యదర్శి కట్ల రాజన్న అన్నారు. శుక్రవారం ఆర్డీఓ కార్యాలయం ఎదుట రహదారిపై నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడారు. పాలస్తీనా ప్రజలపై మారణహోమం సృష్టిస్తు ఇజ్రాయెల్ కిరాతకంగా అమానుషంగా వ్యవహరిస్తోందని అన్నారు. దీన్ని ప్రపంచ దేశాలు ముక్తకంఠంతో ఖండించాలన్నారు. ఇజ్రాయెల్ యుద్ధానికి కాలుదువ్వుతోందని అన్నారు. గాజాలో హాస్పిటల్స్, విద్యాలయాలపై బాంబులు వేసి వేలాది మందిని చంపిందని అన్నారు. ఈ నిరంకుశత్వానికి, యుద్ధానికి వ్యతిరేకంగా పాలస్తీనా ప్రజలు పోరాటాలు చేస్తున్నారని తెలిపారు. ప్రపంచ దేశాలు అక్కడి ప్రజలకు సంఘీభావం ప్రకటించాలని అన్నారు. మన కేంద్ర ప్రభుత్వం కూడా ఐక్యరాజ్య సమితిపై ఇజ్రాయెల్ యుద్ధాన్ని విరమించేలా ఒత్తిడి తేవాలని అన్నారు. ప్రపంచ శాంతిని కాపాడాలని అన్నారు. ఇజ్రాయెల్ రక్తం మరిగిన పులిలా గాజా ప్రజలను రక్తపుటేరుల్లో ముంచుతుందని ఈ విధానాలను దేశ ప్రజలు నిరసించాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు ఎమ్.బక్కన్న, ఆర్.రామలక్ష్మన్, ఎస్.గంగన్న, ఎండీ.గఫూర్, వి.మహేందర్, నాయకులు సాయన్న, రవుఫ్, రాజారాం, గంగాధర్ పాల్గొన్నారు.

సరస్వతీ మాతగా అమ్మవారి దర్శనం





నవతెలంగాణ-జన్నారం

మండల కేంద్రంలో కొలువుదీరిన దుర్గామాత అమ్మవారు సరస్వతి మాతగా భక్తులకు దర్శనమిస్తున్నారు. దసరా శరన్నవరాత్రులలో భాగంగా కనకదుర్గ యూత్ అసోసియేషన్ సభ్యులు మండల కేంద్రంలో దుర్గామాత అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. శుక్రవారం దుర్గామాత అమ్మవారిని వేద పండితులు సరస్వతి మాతగా అలంకరించి పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం మహిళలు కుంకుమ పూజలలో పాల్గొని భక్తి ప్రపత్తులను చాటారు.

రామకృష్ణాపూర్ : పట్టణంలోని స్థానిక అబ్రహం నగర్ కాలనీలో కనక దుర్గ అమ్మవారి మండపం వద్ద శుక్రవారం కుంకుమార్చనలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రాజీవ్ చౌక్‌లోని డ్రైవర్ అసోసియేషన్స్ మండపం వద్ద అంజనిపుత్ర రియల్ ఎస్టేట్ ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

తాండూర్ : మండలములోని కొత్తపెల్లి గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రంలోని పిల్లలకు దుర్గామాత సన్నిధిలో సామూహిక అక్షరభ్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్వరూప రాణి మాట్లాడుతూ ప్రభుత్వం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పిల్లలకు ఆటపాటల ద్వారా విద్యా బోధన అందిస్తుందన్నారు. బడి ఈడు పిల్లలను కేంద్రాలకు పంపించాలని కోరారు. ఇందులో సూపర్‌వైజర్ మమత, అంగన్‌వాడీ టీచర్ ప్రేమల, ఆయా లక్ష్మీ పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే బీజేపీ నాయకురాలు శ్రీదేవి శుక్రవారం శరన్నవరాత్రి ఉత్సవాల్లో ఆర్యవైశ్య సంఘం ఆధవర్యంలో కన్యకాపరమేశ్వరి ఆలయం లో ఏర్పాటుచేసిన దుర్గామాతను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సభ్యులు ఎమ్మెల్యేను సన్మానించారు ఈ కార్యక్రమంలో అనిత రాజులాలు యాదవ్ పాల్గొన్నారు.

మంచిర్యాల : దుర్గామాత నవరాత్రి ఉత్సవాలలో భాగంగా శుక్రవారం సరస్వతి దేవి అవతారంలో అమ్మవారు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలోని 17వ వార్డులో గల హిమ్మత్ నగర్ కాలనీవాసులు అమ్మవారికి కుంకుమ పూజ నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిటీ ప్రధాన కార్యదర్శి వనపర్తి కిరణ్, విగ్రహ దాత ఉదయ్, కమిటీ సభ్యులు గరిగంటి రాజయ్య, చందు, శ్రీకాంత్, తిరుపతి, సాగర్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

కాసిపేట : మందమర్రి ఏరియాలోని కాసిపేట-2 ఇంక్లైన్ గనిపై మైసమ్మ తల్లి ఆలయంలో దేవి నవరాత్రుల ఉత్సవాల సందర్భంగా శుక్రవారం అమ్మవారి శాంతి హోమం నిర్వహించారు. ముందుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య హాజరై అమ్మవారిని దర్శించుకోగా తీర్థ ప్రసాదాలను అందించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ మేడిపల్లి సంపత్, సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ బడికల సంపత్, ఏజెంట్ రాందాస్, గని మేనేజర్ లక్ష్మీనారాయణ, సంక్షేమాధికారి భార్గవ్, సేఫ్టీ ఆఫీసర్ సంతోశ్ రావు, టీబీజీకేఎస్ ఫిట్ సెక్రెటరీ కారుకూరి తిరుపతి, ఏఐటీయూసీ ఫిట్ సెక్రెటరీ గొల్ల శ్రీనివాస్, కొత్తపల్లి ఉదయ్ పాల్గొన్నారు.

దహెగాం : మండల కేంద్రంతో పాటు బీబ్రా గ్రామంలో దుర్గామాత నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం కుంకుమార్చన పూజలు ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఉదయం నుండే ప్రత్యేక పూజలు నిర్వహించి మహిళలు మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో జరిగిన పూజా కార్యక్రమాల్లో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.





